


RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 182 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | శనివారం 22 - ఆగష్టు - 2026 | వెల రూ. 5 /-

## గోల్కొండ కోట సమీపంలో బయటపడ్డ పురాతన సొరంగం

- కుతుబ్ షాహీ కాలం నాటిదిగా భావిస్తున్న అధికారులు
- అగ్నివీరుల శిక్షణ కోసం భూమి చదును చేస్తుండగా గుర్తింపు
- సమాచారం అందుకుని రంగంలోకి దిగిన పురావస్తు శాఖ
- సొరంగం చూసేందుకు భారీగా తరలివచ్చిన స్థానికులు



2

## కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి.. - కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్!

- కొండా సురేఖపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగ్రహం
- 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీల భేటీ
- సుస్మిత వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ
- వ్యాఖ్యలను సురేఖ ఖండించక-పోవడంపై అభ్యంతరం

2



# చివరి నిమిషంలో రేవంత్ అమెరికా టూర్ రద్దు..

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన చివరి నిమిషంలో రద్దయింది. అమెరికాలో నిర్వహించాల్సిన 'తెలంగాణ రైజింగ్' సమావేశాలకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో బ్రిటన్ పర్యటన ముగించుకొని సీఎం ఈ నెల 23న లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి లండన్, అమెరికాలో 'తెలంగాణ రైజింగ్' పేరుతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా అమెరికాలోని బోస్టన్, న్యూయార్క్‌లో సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి కార్యాలయం షెడ్యూల్ కూడా సిద్ధం చేసింది. అయితే చివరి నిమిషంలో కేంద్ర విదేశాంగ శాఖ నుంచి అనూహ్య పరిణామం ఎదురైంది. యూకేలో జరిగే సమావేశాలకు మాత్రమే అనుమతి లభించింది. అమెరికాలో నిర్వహించాల్సిన సమావేశాలకు గ్రీన్‌సిగ్నల్ రాలేదు. దీంతో సీఎం తన పర్యటనను కుదించుకుని హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, కేంద్రం నిర్ణయం వెనక కారణం ఏంటనేది మాత్రం ఇంకా అధికారికంగా తెలియరాలేదు. ప్రస్తుతం రద్దయిన అమెరికా పర్యటనను వచ్చే నెలలో చేపట్టాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ఈసారి అమెరికాలో జరగాల్సిన భేటీలకు సీఎం స్వయంగా




వెళ్లకుండా అధికారుల బృందాన్ని పంపే యోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ యువత భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా 'తెలంగాణ రైజింగ్' ప్రయాణం ఆగదని ధీమా వ్యక్తం చేశారు.

- అమెరికా సమావేశాలకు కేంద్రం అనుమతి నిరాకరణ
- ఈ నెల 23న లండన్ నుంచి హైదరాబాద్ చేరుకోనున్న సీఎం
- వచ్చే నెలలో అమెరికా వెళ్లే యోచన
- అమెరికా భేటీలకు అధికారులను పంపే అవకాశం

## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ.. కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సమీక్ష




- జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై నడ్డా సమీక్ష
- నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలను సమీక్షించిన నడ్డా
- వ్యాధి లక్షణాలున్నవారిని ముందస్తుగా గుర్తించడం కీలకమన్న కేంద్ర మంత్రి

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** దేశంలో స్వైన్ ఫ్లూ (H1N1) కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలు పటిష్ఠంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లోని ఆసుపత్రులలో బెడ్ల లభ్యత, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుతో పాటు అవసరమైన మందులు, టీకాల లభ్యతపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, హెల్త్ సెక్రటరీలతో కూడిన బృందానికి నిరంతరం కేసులను పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం.. ప్రజల్లో పరిశుభ్రత, అవగాహన పెంపొందించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల జిల్లాల్లో కూడా అవసరమైన ఫ్లూ నిరోధక మందుల కొరత లేకుండా చూడాలని అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖలను కోరారు.

## సున్నం చెరువు రూపురేఖలు మార్చేస్తున్న హైడ్రా..

- సర్వాంగ సుందరంగా సున్నం చెరువు
- కబ్జాలు తొలగించి చెరువును 14 నుంచి 30.5 ఎకరాలకు విస్తరణ
- ఆలయ కమిటీ సహకారంతో ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి
- వాకింగ్ ట్రాక్, పచ్చదనం, ఓపెన్ జిమ్‌లతో పర్యాటక హంగులు
- త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



2

## బాబోయ్, ఎకరం రూ.264 కోట్లు.. రాయదుర్గంలో ఆల్ టైమ్ రికార్డు ధర

- రాయదుర్గంలో ఎకరాకు రూ. 264 కోట్లతో కొత్త భూ రికార్డు
- ఒక్క ప్లాట్ వేలంతో టీజీఐఐసీకి రూ. 1,386 కోట్ల ఆదాయం
- గత మే నెలలో నమోదైన రూ. 237 కోట్ల రికార్డు బద్దలు
- ఐటీ కారిడార్‌లో ఉండటంతో రియల్ ఎస్టేట్ సంస్థల తీవ్ర పోటీ



2

## కబ్జాకోరులకు మల్కాజ్‌గిరి మహిళా సీపీ షాక్.. వృద్ధురాలికి దక్కిన రూ.40 కోట్ల భూమి!



- హైదరాబాద్‌లో 80 ఏళ్ల వృద్ధురాలి భూమికి రక్షణ
- రూ.40 కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నం
- మల్కాజ్‌గిరి సీపీ సుమతిని ఆశ్రయించిన వృద్ధురాలు
- రాజకీయ ఒత్తిళ్లను కాదని వృద్ధురాలికి న్యాయం చేసిన సీపీ

2

## నా టార్గెట్ రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కాదు - కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు

- సోనియా, రాహుల్, ప్రియాంకపై గౌరవం ఉందన్న సుస్మిత
- రేవంత్, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోందని ఆరోపణ
- 'టికెట్ నిర్ణయించడానికి సీఎం ఎవరు?' అని ప్రశ్న
- స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధమని ప్రకటన
- పరకాల నుంచి పోటీ చేయడం ఖాయమని వెల్లడి

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కుమార్తె వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సురేఖ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కేవలం సీఎం రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఆ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు. "సీఎం రేవంత్ రెడ్డి పరకాల వచ్చి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. నేను రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేశాను. పార్టీని కాదు. నాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్‌పై చాలా గౌరవం ఉంది. కానీ, రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబం అవినీతికి ........



2

## నా టార్గెట్ రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కాదు

### - కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి..** పాల్పడుతోంది. అందుకే వారిని టార్గెట్ చేసుకున్నాను. పైగా ఎమ్మెల్యే టికెట్ ఎవరికివ్వాలో నిర్ణయించడానికి ఆయన ఏవరు? సీడబ్ల్యూసీ సమావేశాల వంటి వ్యవస్థ ఉంది కదా. ఆ ప్రకారంగానే అభ్యర్థులను ప్రకటిస్తారు. నేను అదే ప్రశ్నించాను. నేను స్వతంత్రగా పోటీ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను'' అని కొండా సుస్మిత ఓ జాతీయ మీడియా ఛానెల్‌తో మాట్లాడుతూ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమంటూ గీసుకొండలో బుధవారం నాడు సుస్మిత అన్న విషయం తెలిసిందే. ఇటీవల పరకాల బహిరంగ సభలో 'వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలి' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అలా ఏకపక్షంగా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. సీఎం సోదరుడు పెట్టిన డొల్ల కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని.. తన వ్యాఖ్యలపై కౌంటర్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తే సీఎం కుటుంబం అవినీతిని ఒక్కొక్కటిగా బయటపెడతానన్నారు.

## కబ్జాకోరులకు మల్కాజ్‌గిరి మహిళా సీపీ షాక్..

### వృద్ధురాలికి దక్కిన రూ.40 కోట్ల భూమి!

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 80 ఏళ్ల ఓ వృద్ధురాలు భూకబ్జాదారుల చెర నుంచి తన రూ. 40 కోట్ల విలువైన ఆస్తిని దక్కించుకున్నారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ (సీపీ) సుమతి చొరవతో ఆమెకు సకాలంలో న్యాయం చేకూరింది. రాజకీయ ఒత్తిళ్లను సైతం లెక్క చేయకుండా నిందితులపై కఠినంగా వ్యవహరించి, వృద్ధురాలికి బాసటగా నిలిచిన సీపీపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన సదరు మహిళకు సుమారు రూ. 40 కోట్ల విలువైన ఖాళీ స్థలం ఉంది. దశాబ్దాలుగా ఆ భూమి ఆమె స్వాధీనంలోనే ఉన్నప్పటికీ, ఇటీవల కొందరు భూకబ్జాదారులు ఆ ఆస్తిపై కన్నేశారు. అక్రమంగా స్థలంలోకి చొరబడి, అది తమదేనంటూ సదరు వృద్ధురాలిని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలో బాధిత మహిళ ధైర్యంతో మల్కాజ్‌గిరి సీపీ సుమతిని ఆశ్రయించారు. తన భూమికి సంబంధించిన అన్ని దస్తావేజులను సమర్పించి, న్యాయం చేయాలని ఆమెను అభ్యర్థించారు. వృద్ధురాలి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన సీపీ సుమతి, సమగ్ర విచారణకు ఆదేశించారు. రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, ఆ భూమి బాధితురాలిదేనని ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల ద్వారా కబ్జాదారులు ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయినప్పటికీ సీపీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, ఆ స్థలం తమదేనని వాదిస్తున్న వారిని పిలిపించి ఆధారాలు సమర్పించాలని ఆదేశించారు. వారు సరైన పత్రాలను చూపలేకపోవడంతో, ఆ భూమి వృద్ధురాలిదేనని అధికారులు తుది నిర్ధారణకు వచ్చారు. కోట్లాది రూపాయల విలువైన తన ఆస్తి తిరిగి దక్కడంతో ఆ వృద్ధురాలు హర్షం వ్యక్తం చేశారు. సీపీ సుమతి ప్రదర్శించిన చొరవను, వృత్తిపరమైన నిబద్ధతను స్థానికులు కొనియాడుతున్నారు. భూకబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## రాజస్థాన్‌లో స్కూల్ తనిఖీకి వెళ్లిన కాక్రోచ్ పార్టీ కార్యకర్తలపై గ్రామస్థుల దాడి!



**నేటి శుభోదయ, రాజస్థాన్ :** రాజస్థాన్‌లో ప్రభుత్వ పాఠశాల పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలపై గ్రామస్థులు దాడి చేశారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ ఘటనపై సీజేపీ కో-కన్వీనర్ అశుతోష్ రంకా తీవ్రంగా స్పందించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయడంతో పాటు విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి 48 గంటల గడువు విధించారు. సంగనేర్‌లోని రాంపురా-కన్వర్‌పురా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పరిస్థితిని పరిశీలించేందుకు సీజేపీ బృందం వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు రంకా తెలిపారు. ఆ పాఠశాల కొన్నేళ్లుగా గేదెల కొట్టంలో కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. గతేడాది కూడా తమ బృందం అక్కడికి వెళ్లిందని, పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించలేదని చెప్పారు. తమ బృందం అక్కడికి చేరుకునేలోపే కొంతమంది బీజేపీతో సంబంధం ఉన్న వ్యక్తులు అక్కడ ఉన్నారని, అనంతరం ఒక్కసారిగా దాడి జరిగిందని రంకా ఆరోపించారు. తమ వాహనాల అద్దాలు పగలగొట్టారని, మొబైల్ ఫోన్లు ధ్వంసం చేశారని, మహిళా కార్యకర్తపై దాడి చేశారని చెప్పారు. తన చొక్కా కూడా చించివేశారని పేర్కొన్నారు. ఓ కార్యకర్త చేయి విరిగిందని, తమపై రాళ్ల దాడి కూడా జరిగిందని ఆరోపించారు. పోలీసులకు ముందే సమాచారం ఇచ్చినా వారు ప్రేక్షక పాత్ర పోషించారని రంకా ఆరోపించారు. మహిళా కార్యకర్తలపై కూడా రాళ్లు విసిరి, వారి ఫోన్లు ధ్వంసం చేశారని చెప్పారు. ఈ దాడి ముందస్తు ప్రణాళికతోనే జరిగిందని ఆయన ఆరోపించారు. పాఠశాల తనిఖీలపై విధించిన ఆంక్షలను కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని రంకా డిమాండ్ చేశారు. 48 గంటల్లో నిందితులపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈసారి పోరాటం కేవలం పాఠశాలల సమస్యలకే పరిమితం కాదని, మంత్రి మదన్ దిలావర్ రాజీనామాను కూడా డిమాండ్ చేస్తామని స్పష్టం చేశారు. కాగా, సీజేపీ బృందం పాఠశాల ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో స్థానిక గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్తత పెరిగింది. ఘటనకు సంబంధించి నిందితుల వివరాలు, పోలీసుల తదుపరి చర్యలపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# గోల్కొండ కోట సమీపంలో బయటపడ్డ పురాతన సొరంగం

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లోని చారిత్రాత్మక గోల్కొండ కోట సమీపంలో ఒక పురాతన సొరంగం బయటపడింది. ఇది కుతుబ్ షాహీ కాలం నాటిదిగా అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అగ్నివీరుల శిక్షణ నిమిత్తం భూమిని చదును చేస్తుండగా ఈ సొరంగ మార్గం అనుకోకుండా వెలుగులోకి వచ్చింది. గోల్కొండ కోట పరిసర ప్రాంతమైన అత్తాపూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. అగ్నివీరుల శిక్షణ కోసం గోల్కొండ ఆర్టిలరీ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో భూమిని ఎత్తుపల్లాలు లేకుండా మారుస్తుండగా, భూగర్భంలోని ఈ నిర్మాణం బయటపడింది. వెంటనే స్పందించిన అధికారులు పనులను నిలిపివేసి, కేంద్ర పురావస్తు శాఖ అధికారులకు సమాచారం అందించారు. భారీ రాతి పలకలతో కప్పి ఉన్న ఈ సొరంగంలోకి వెళ్లేందుకు వీలుగా మార్గం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా జనసంచారం తక్కువగా ఉండే ఈ ప్రాంతంలో సొరంగం బయటపడిందన్న వార్త తెలియడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. దీంతో పోలీసులు ముందుజాగ్రత్త చర్యగా ఆ ప్రాంతంలో పికెట్ ఏర్పాటు చేశారు. ఈ సొరంగం పొడవు ఎంత? లోపల ఏవైనా చారిత్రక కళాఖండాలు ఉన్నాయా? అనే అంశాలపై స్థానికులు, చరిత్రకారుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. పురావస్తు శాఖ చేపట్టబోయే తవ్వకాలతో మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి..

### - కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్!

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ఈ అంశంపై ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా సమావేశమై చర్చించారు. అనంతరం కొండా సురేఖను రాష్ట్ర మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను టార్గెట్ చేస్తూ కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆమె వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కూడా సురేఖకు వ్యతిరేకంగా గళం విప్పారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యేలు మీడియా సమావేశంలో మాట్లాడారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవడాన్ని ఎమ్మెల్యేలు తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలపై బాధ్యత వహించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. సీఎంను వ్యతిరేకించే వారికి పార్టీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు. మీ భాష ఎప్పుడూ పార్టీకి నష్టం కలిగించేలా ఉందని కొండా ఫ్యామిలీని ఉద్దేశించి అన్నారు. సుస్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడంపైనా ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇచ్చిన వివరణ తమకు ఆమోదయోగ్యంగా లేదని తేల్చారు. సీఎం రేవంత్ ఎంతో కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. అలాంటి వ్యక్తిని విమర్శించినప్పుడు ఖండించడం కనీస బాధ్యత అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చాలనే ప్రతిపక్షాల కుట్రలకు బలం చేకూర్చుతున్నారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని కోరారు.

## సున్నం చెరువు రూపురేఖలు మార్చేస్తున్న హైడ్రా..

**మొదటిపేజీ తరువాయి..** చేసుకోవాలని హైదరాబాద్ నగరంలోని సున్నం చెరువు రూపురేఖలు సమూలంగా మారిపోతున్నాయి. ఒకప్పుడు మురికి కూపంగా, దుర్వాసనతో అల్లాడిన ఈ చెరువును 'హైడ్రా' సుందర సరోవరంగా తీర్చిదిద్దుతోంది. త్వరలోనే ఈ చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకవైపు బోరబండ బస్తీ, మరోవైపు ఐటీ కారిడార్ మధ్య ఉన్న ఈ చెరువు గతంలో ఆక్రమణల కారణంగా కేవలం 14.20 ఎకరాలకు కుంచించుకుపోయింది. అయితే, హైడ్రా అధికారులు నివాస గృహాలను ఏమాత్రం ప్రభావితం చేయకుండానే, కేవలం కబ్జాలను తొలగించి చెరువును తిరిగి 30.5 ఎకరాలకు విస్తరించారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంతో పాటు, సుమారు 3 మీటర్ల మేర పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించారు. ఫలితంగా దుర్వాసన మాయమై, పరిసర ప్రాంత ప్రజలకు ఉపశమనం లభించింది. చెరువు ఆవరణలోని ఆంజనేయ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులను కూడా హైడ్రా చేపట్టింది. ఆలయ కమిటీ ప్రతినిధుల సూచనల మేరకు గోపురం, ప్రదక్షిణ మార్గం, భక్తులు కోసం మార్బుల్ గెజిబో వంటి అత్యాధునిక వసతులు కల్పిస్తున్నారు. కాగా, ఈ ఆలయాన్ని తొలగిస్తున్నారంటూ కొందరు సాగిస్తున్న దుష్ప్రచారాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను తాము స్వాగతిస్తున్నామని వారు స్పష్టం చేశారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్నారుల కోసం క్రీడా స్థలాలు, పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర వాతావరణాన్ని అభివృద్ధి చేస్తున్నారు. వీటితో పాటు బోటింగ్ సౌకర్యం, సోలార్ లైటింగ్, పటిష్ఠమైన ఫెన్సింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇదే సమయంలో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నివసిస్తున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

# బాబోయ్, ఎకరం రూ.264 కోట్లు..

## రాయదుర్గంలో ఆల్ టైమ్ రికార్డు ధర

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త రికార్డు నమోదైంది. రాయదుర్గంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (TGIIC) నిర్వహించిన వేలంలో ఎకరా భూమి ఏకంగా రూ. 264 కోట్లు పలికింది. మొత్తం 5.25 ఎకరాల ప్లాట్ విక్రయం ద్వారా ప్రభుత్వ సంస్థ అయిన టీజీఐఐసీకి రూ. 1,386 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. హైదరాబాద్‌లో భూమి ధరకు సంబంధించి ఇదే ఆల్ టైమ్ రికార్డ్. రాయదుర్గం పాన్‌మక్తాలోని సర్వే నెం. 83/1లో ఉన్న ప్లాట్ నెం. P1 కోసం శుక్రవారం ఈ-వేలం నిర్వహించారు. ఎకరాకు రూ. 175 కోట్ల కనీస ధరతో వేలం ప్రారంభించగా, దానిపై ఏకంగా 50.9 శాతం అధికంగా ధర పలికింది. ఇదే కారిడార్‌లో గత మే నెలలో టీజీఐఐసీ నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ. 237 కోట్లు పలికింది. తాజా వేలంలో ఆ రికార్డు బద్దలైంది. హైదరాబాద్ ఐటీ, నాలెడ్జ్ సిటీ గ్రోత్ కారిడార్‌లో ఈ భూమి ఉండటం దీనికి ప్రధాన కారణం. ఐటీసీ కోహినూర్ హోటల్‌కు ఎదురుగా, దుర్గం చెరువు, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు అత్యంత సమీపంలో ఈ ప్లాట్ ఉంది. మల్టీ-యూజ్ జోన్‌గా ఉన్న ఈ భూమి కోసం పలు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు తీవ్రంగా పోటీపడ్డాయి. ఈ వేలంలో పాల్గొనేందుకు బిడ్డర్లు రూ. 10 కోట్ల డిపాజిట్ చెల్లించారు. ఈ భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ చారిత్రక రాతి కట్టడాలు ఉన్నాయని, దుర్గం చెరువుకు సమీపంలో ఉన్నాయని, యాజమాన్య హక్కుల వివాదాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. అయితే, వేలం ప్రక్రియను నిలిపివేసేందుకు న్యాయస్థానాలు నిరాకరించాయి. ఈ ప్లాట్లు రక్షిత వారసత్వ ప్రాంతాలు, బఫర్ జోన్ల పరిధిలోకి రావని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా రాయదుర్గం ప్రాంతంలో భూముల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. 2025లో ఇక్కడ ఎకరా ధర రూ. 177 కోట్లుగా ఉండేది. ఇప్పుడు అంతకుమించి రికార్డు ధర పలికింది. తాజా డిమాండ్ నేపథ్యంలో, ఇదే సర్వే నంబరులో మరో 5.38 ఎకరాల ప్లాట్‌కు ఆగస్టు 28న వేలం నిర్వహించనున్నట్లు టీజీఐఐసీ ప్రకటించింది. వరుస వేలాలతో రాయదుర్గం

# మురుగు నీటి డ్రైనేజి నిర్మాణం ప్రారంభం



**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ధర్పల్లి గ్రామ పంచాయతీ ఏడో వార్డులో డ్రైనేజీ మెరుగు పరిచేందుకు మురికి కాలువ నిర్మాణం. మరమ్మతు పనులు ప్రారంభించిన సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్ ఉప సర్పంచ్ ఎజ్జ శ్రీకాంత్ వారి సహకారంతో ఏడవాడలో వార్డుమెంబర్ నిమ్మల వినయ గౌడ్ ఆధ్వర్యంలో డ్రైనేజీ పనులు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో నిమ్మలు వినయ్ గౌడ్ మాట్లాడుతూ తన వార్డులో గెలిపించినందుకు ఏడవ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం ముందుకు సాగుతుందని ఆయన అన్నారు వార్డులో ఎక్కడ మురికి కాలువలు అవసరం ఉన్న చోట కొత్త కాలువలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ తో పాటు చక్రపాణి. వినయ్ గౌడ్ శ్రావణ్. అజయ్. రాజు రాములు పాల్గొన్నారు

# మూడు నెలల్లో రైల్వే స్టేషన్ పనులు పూర్తి కాకపోతే ముట్టడి : నున్నా నాగేశ్వరరావు



**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** సంవత్సరాల తరబడి ఖమ్మం రైల్వే స్టేషన్ పనులు చాలా నత్తనడక సాగుతున్నాయి అని, ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్న సదరు కాంట్రాక్టర్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలి అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం రైల్వే స్టేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ మేనేజర్ కు వినతిపత్రం సమర్పించారు. రైల్వే స్టేషన్ అంతా బృందం కలియతిరిగి అధ్వానంగా నడుస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి పనులు చాలా నత్తనడక గా ఆధునీకరణ పనులు నడుస్తుంటే ఖమ్మం పార్లమెంట్ సభ్యులు ఏమి చేస్తున్నారు అని ప్రశ్నించారు. మూడు ప్లాట్ ఫాంలపై అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు వుంది ఆరోపించారు. 34 కోట్లతో అభివృద్ధి పనులు అంతా చాలా నెమ్మదిగా నడవటంతో రోజు వేలాది మంది ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు అని విమర్శించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు వెంటనే పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. మంచి నీటి సౌకర్యం లేదు అని, ఎస్కలేటర్లు , లిఫ్ట్ పనులు పూర్తి స్థాయిలో కూడా చేయలేదు అని ఆరోపించారు. ఏసీ, వెయిటింగ్ హాల్ పనులు పెండింగ్ లో వున్నాయి అని విమర్శించారు. రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద ముఖ్యమైన ఆఫీస్ కార్యాలయం, టికెట్ కౌంటర్ హాల్, అధికారుల ప్రధానమైన ఆఫీస్ లు ఇలా అన్ని పనులు నత్తనడకన నడుస్తున్నాయి అని విమర్శించారు. రాబోయే మూడు నెలల్లో రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు పూర్తి కాకపోతే రైల్వే స్టేషన్ ను ముట్టడి చేస్తామని ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసురావు, మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, ఎం ఏ జబ్బార్, దొంగల తిరుపతిరావు, భుక్యా శ్రీనివాసురావు, ఎస్ కే నాగుల మీరా, బోడపట్ల సుదర్శన్, వజేనేపల్లి శ్రీనువాసురావు తదితరులు పాల్గొన్నారు.

# పాడైపోయిన రోడ్లను వెంటనే బాగుచేయాలి

**- రోడ్ల సమస్య పరిష్కరించకుంటే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడిస్తాం: AIYF**




**డిండి(గుండ్లపల్లి), ఆగస్టు 21, నేటి శుభోదయ :** డిండి మండలంలోని పాడైపోయిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి, పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (AIYF) డిమాండ్ చేసింది. రోడ్ల దుస్థితి కారణంగా ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే వచ్చే నెలలో దేవరకొండ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించింది.రోడ్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ AIYF ఆధ్వర్యంలో శుక్రవారం గోనకల్ నుంచి డిండి వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. గోనకల్‌లో CPI డిండి మండల సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్ AIYF జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. నల్గొండ జిల్లా AIYF అధ్యక్షుడు ఎనమల్ల నవీన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం డిండి పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించి గంటపాటు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఎనమల్ల నవీన్ మాట్లాడుతూ, 2024 జనవరి 8న డిండి మండల కేంద్రంలో డిండి–దేవరకొండ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించినప్పటికీ ఇప్పటివరకు పనులు పూర్తికాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.AISF తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బలుముల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, రోడ్ల అధ్వాన పరిస్థితి కారణంగా విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రతిరోజూ గుంతల రోడ్లపై ప్రయాణించాల్సి వస్తోందని, ప్రమాదాలు జరిగే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల సమస్యను అభివృద్ధి పనిగా కాకుండా ప్రజలు, విద్యార్థుల భద్రతకు సంబంధించిన అత్యవసర సమస్యగా ప్రభుత్వం పరిగణించాలని డిమాండ్ చేశారు.డిండి–దేవరకొండ ప్రధాన రహదారితో పాటు తవక్లాపూర్–నగరదుబ్బ తండా, రామంతపూర్–గదరాళ్ల తండా, వావిల్‌కోల్–బ్రాహ్మణపల్లి తండా, శాంతిగూడెం, కందుకూరు–నిజాంనగర్, కింది శేషాయికుంట–మీది శేషాయికుంట, బొగ్గులదోన గేటు–బొగ్గులదోన, కిష్టంపల్లి గేటు–పడమటిపల్లి తదితర రోడ్లను కూడా వెంటనే బాగుచేయాలని నాయకులు కోరారు.రోడ్లపై భారీ గుంతలను వెంటనే పూడ్చడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో పునర్నిర్మాణ పనులు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆగస్టు నెలలోపే రోడ్ల మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే బాలు నాయక్‌ను కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే వచ్చే నెలలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమానికి CPI, AISF మద్దతు ప్రకటించాయి. AIYF డిండి మండల అధ్యక్ష, కార్యదర్శులు కాంపల్లి ప్రవీణ్, ఎలిమినేటి నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో AIYF, AISF, CPI నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థినికి వాక్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



**వరంగల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 23వ డివిజన్ కొత్తవాడకు చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త గాజర్ల విజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ శుక్రవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.మృతుని కుమార్తె గాజర్ల దేవన్ష పై చదువుల నిమిత్తం వాక్ ఫౌండేషన్ ద్వారా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని డాక్టర్ వన్నాల వెంకటరమణ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ.. వాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్ధన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో నిరుపేద కుటుంబాలకు ప్రతినెలా బియ్యం పంపిణీ చేయడంతో పాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని పంపిణీ చేయడం, నిరుపేద విద్యార్థులకు పాఠశాల ఫీజుల కోసం ఆర్థిక సహాయం అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముంద్రాతి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు విప్ప సుధాకర్, సీతా నాగరాజు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు వావిలాల శోభారాణి, మహిళా మోర్చా బీజేపీ నాయకురాలు గాజర్ల సుశీల, కె. మౌనిక తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చొరవ

**- తాళ్ల రాముడు గ్రామంలో ఎంపీడీఓ పరిశీలన**



**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** తాళ్ల రాముడు గ్రామం ఎస్సీ కాలనీలో ఎన్నో సంవత్సరాలనుండి ఎదురవుతున్న తీవ్ర డ్రైనేజీ మురుగునీటి సమస్యపై స్పందించిన గ్రామ సర్పంచ్ వరలక్ష్మి సంతోష్ సిరికొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే స్పందించి స్వయంగా గ్రామాన్ని సందర్శించారు.గ్రామానికి విచ్చేసిన ఎంపీడీఓ గారు ఎస్సీ కాలనీలోని డ్రైనేజీ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్య తీవ్రతను అడిగి తెలుసుకుని, మురుగునీటి పారుదల సాఫీగా జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వరలక్ష్మి సంతోష్, ఉప సర్పంచ్ నవీన్, పంచాయతీ కార్యదర్శి లంక సుమన్, కారాబర్ ఎ. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ సమస్యపై వెంటనే స్పందించి పరిశీలనకు వచ్చిన ఎంపీడీఓ గారికి, ప్రజాప్రతినిధులకు గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# పుట్టగొడుగుల్లాగా రాత్రికి రాత్రి అక్రమ కట్టడాలు

- ఏమాత్రం స్పందించని స్థానిక అధికారులు
- వెంటనే ఈ కట్టడాలను నిలిపివేయాలని స్థానికులు డిమాండ్



**మల్కాజ్ గిరి, ఆగస్టు 21, నేటి శుభోదయ :** మల్కాజ్ గిరి ఓల్డ్ సఫిల్ గూడ డిఏవి పబ్లిక్ స్కూల్ వెనుక భాగాన రాత్రికి రాత్రి అక్రమ కట్టడాలు ఈ కట్టడాల వెనుక ఏ అధికారులు ఉన్నారు?ఏ రాజకీయ నాయకులు ఉన్నారు? రెసిడెన్షియల్ జోన్ లో కమర్షియల్ గా పర్మిషన్లు ఎవరు ఇచ్చారు.రాత్రికి రాత్రే షెడ్డులు ఏర్పడ్డాయి,అంటే దీని వెనకాల ప్రభుత్వ అధికారులు ఉన్నారా? రాజకీయ నాయకులు ఉన్నారా లేక వారాంతటికి వారే ధైర్యంగా ఎవరేం చేస్తారులే అని స్టేడియం కడుతున్నారా అనేది ప్రశ్నార్థకం ప్రత్యక్షంగా మా ప్రతినిధులు దర్యాప్తు చేయగా దీని వెనకాల రాజకీయ నాయకులు అట్లాగే ప్రభుత్వ అధికారులు కలిసి ఒక ప్యాకేజీ ప్రకారం వీటికి అనాథరైజ్డ్ గా కట్టుకోవటానికి పర్మిషన్స్ కూడా ఇస్తున్నారని తెలుస్తోంది మరి దీనిపై పై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూద్దాం ఎందుకంటే మైక్యూర్ యాప్ ద్వారా ఎన్నో అప్లికేషన్లు ఇస్తున్నా గాని మల్కాజ్గిరి డివిజన్లో ఒక్కటి కూడా ప్రాబ్లం సాల్వ్ చేయట్లేదు,ఈ అలసత్వానికి కారణం సదరు అధికారుల పనితీరుపై అనుమానాలు వస్తున్నాయి. అని స్థానికులు సంబంధిత కాలనీ ప్రజలు అంటున్నారు.

# సిరికొండ పాఠశాలలో 'కమ్యూనిటీ ఇంకుడు గుంత' నిర్మాణానికి శ్రీకారం



**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** భూగర్భ జలాల పెంపొందేలా, పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేందుకు సిరికొండ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు శనివారం ముగ్గు పోసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మహమ్మద్ రఫీ, సర్పంచ్ మల్లెల సాయి చరణ్ మాట్లాడుతూ పాఠశాలల్లో వినియోగించిన నీరు వృథాగా పోకుండా ఇంకుడు గుంతలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. వర్షపు నీటితో పాటు ఉపయోగించిన నీటిని భూమిలోకి ఇంకింపజేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గ్యామా శోభన్, టీఏ శ్రీనివాస్, ఏపీవో రాజశేఖర్, హెచ్‌ఎం నరేష్, వార్డు మెంబర్ మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ గణేష్ పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా బీజేపీ మహిళా మోర్చా జిల్లా కమిటీ ఏర్పాటు

**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా మహిళా మోర్చా జిల్లా కమిటీని శుక్రవారం ఏర్పాటు చేయడం జరిగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్ర రావు ఆదేశాల మేరకు మహిళ మోర్చా రాష్ట్రా అధ్యక్షురాలు శిల్ప రెడ్డి ఆదేశాల మేరకు బీజేపీ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు సహకారం తో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంద సరస్వతి ఆధ్వర్యంలో నూతన జిల్లా కమిటీని ప్రకటించారు.మహిళల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కేంద్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, పార్టీ బలోపేతానికి మహిళా మోర్చా కార్యకర్తలు కృషి చేయాలని మంద సరస్వతి తెలిపారు.నూతన కమిటీలో ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కోశాధికారి, కార్యాలయ కార్యదర్శి, అధికార ప్రతినిధి, సోషల్ మీడియా కన్వీనర్ మరియు కో–కన్వీనర్, మన్ కీ బాత్ కన్వీనర్, కో–కన్వీనర్, కార్యవర్గ సభ్యులు కలిపి మొత్తం 23 మంది సభ్యులకు బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మంద సరస్వతి మాట్లాడుతూ "బీజేపీ మహిళా మోర్చాను ఖమ్మం జిల్లాలో మరింత బలోపేతం చేసి, ప్రతి మహిళకు పార్టీ సిద్ధాంతాలను మరియు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేస్తాం. మహిళల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తాం. నూతన కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి" అని అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు, బీజేపీ శ్రేణులు నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.

# ఎనుమాములలో జోరుగా పేకాట

## - అడ్డుకట్ట ఎక్కడ?

- పేకాట శిబిరాలతో కుటుంబాల్లో కలకలం
- సర్వస్వం కోల్పోతున్న బాధితులు..
- పోలీసుల ప్రత్యేక నిఘాకు స్థానికుల డిమాండ్



**వరంగల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** వరంగల్ నగరంలోని ప్రముఖ వ్యాపార కేంద్రమైన ఎనుమాముల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పేకాట శిబిరాలు కొనసాగుతున్నాయంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేకాట కారణంగా పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారుతున్నాయని, ఈ జూదానికి అలవాటు పడుతున్న పలువురు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంపాదించిన డబ్బును కుటుంబ అవసరాలకు వినియోగించకుండా పేకాటలో పెట్టడంతో కొన్ని కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

**మాయమాటలతో పేకాటలోకి**

పేకాట అలవాటు లేని వారిని సైతం మాయమాటలతో ఆటలోకి దింపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలుత సరదాగా ప్రారంభమైన ఆట క్రమంగా వ్యసనంగా మారి, చివరకు అప్పులు చేసి మరీ పేకాట ఆడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు అంటున్నారు. దీంతో కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులతో పాటు అనేక సమస్యలు తలెత్తుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రత్యేక నిఘా పెట్టాలి**

ఎనుమాముల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పేకాట నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. పేకాట శిబిరాలపై ఆకస్మిక తనిఖీలు, దాడులు నిర్వహించి, చట్టవిరుద్ధంగా జూదం నిర్వహిస్తున్నట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పేకాటను పూర్తిగా అరికట్టేలా నిరంతర నిఘా కొనసాగించాలని కోరుతున్నారు.

**కుటుంబాలను కాపాడాలని విజ్ఞప్తి**

జూదం కారణంగా కుటుంబాలు ఆర్థికంగా నష్టపోకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా యువత పేకాటకు ఆకర్షితులు కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతున్నారు. ఎనుమాముల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పేకాటకు అడ్డుకట్ట వేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ ఉన్నతాధికారులను స్థానికులు కోరుతున్నారు.పేకాట శిబిరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, చట్టవిరుద్ధ కార్యకలాపాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు

# ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యోదంతంపై జిల్లా పాఠశాలల ఉపాధ్యాయులు యాజమాన్యాల ర్యాలీ

- నల్గొండ జిల్లాలో ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యోదంతంపై కదం తొక్కిన పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు
- ఈ ఉదంతం విద్యావ్యవస్థ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోందన్న యాజమాన్యాలు
- పరిస్థితులు ఇలానే ఉంటే ఈ వృత్తిలో కొనసాగలేమంటున్న ఉపాధ్యాయులు




**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ఇటీవల నల్గొండ జిల్లాలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ హత్య చేసిన సంఘటనను నిరసిస్తూ "ట్రెస్మా" (తెలంగాణ రికగ్నైజ్డ్ ప్రైవేటు స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్) ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో యాజమాన్యాలు, ఉపాధ్యాయులు ఖమ్మం నగర వీధుల్లో శుక్రవారం కదం తొక్కారు. తొలుత ఈ ర్యాలీని ఫెమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు ప్రారంభించారు.సమాజంలోని సమస్త రంగాలకు నైపుణ్యం కలిగిన మేధావులను తయారు చేసి అందించే గురువులపై జరుగుతున్న దమనకాండకు ఆగ్రహించిన ఉపాధ్యాయులతో పాటు పాఠశాలల యాజమాన్యాలు ఉద్యమించాయి. మునుముందు ఇంకా విపరీత పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఏదో ఒక నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాకపోతే భారతదేశంలో విద్యా వ్యవస్థ అనేది ఉండదనే హెచ్చరికను తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ కార్యకమంలో ఖమ్మం ట్రెస్మా అధ్యక్షులు గుర్రం కాంతారావు, కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, కోశాధికారి యెలిశెట్టి నాసరయ్య, ట్రెస్మా రాష్ట్ర నాయకులు కేసా వీరన్న, ఐ.వి.రమణారావు, పి.రవి మారుత్, కొండపల్లి శశిధర్ రెడ్డి,కోటగిరి ప్రవీణ్,కందుల శంకరయ్య, ఇస్మాయిల్,అంజన్ బాబు జిల్లా నాయకులు సంక్రాంతి రవికుమార్,మహ్మద్ అజారుద్దీన్, కె.వెంకటేశ్వరరావు,కె.ఉమాశంకర్, కెనారాయణరావు, వి.నాగార్జున, కె.మహేష్, పి.శ్రీనివాసరావు, జి.సౌభాగ్య, షేక్.హుస్సేన్, కె.భాస్కర్, యస్.ప్రకాశరావు, పి.ఉపేందర్, ఏ.సందీప్ కుమార్,యస్.శ్రీవిద్య పాలేరు డివిజన్ ట్రస్మా నాయకులు పి.శివకృష్ణ, వి.శ్రీనివాస్, వైరా నాయకులు బి.కిరణ్, ఖమ్మం డివిజన్ ట్రస్మా నాయకులు జాఫర్ మతిన్, హరిబాబు,మోహన్ రెడ్డి, టి.వి.అప్పారావు,కార్తీక్, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు. ఈ ర్యాలీకి ప్రత్యేక అతిథులుగా జె.యన్.టి.యు పాలకమండలి సభ్యులు కాటేపల్లి నవీన్ బాబు, జూనియర్ కళాశాల అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా శేషగిరి హాజరయ్యారు.

# 17వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

## - ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. జి. క్లెమెంట్

**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ఈనెల 23, 24 తేదీలలో సత్తుపల్లి లో జరిగే ఏఐటియుసి 17వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఖమ్మం నగర కార్పొరేటర్ బి. జి. క్లెమెంట్ కార్మికులను కోరారు. కొనిజర్ల మండలంలో జరిగిన కార్మికుల సమావేశంలో ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 107 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా 17వ మహాసభలో సత్తుపల్లి లో జరగనున్నాయన్నారు. ఈ మహాసభలకు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల దేశంలో కార్మిక వర్గం ఎనిమిది గంటల పని, కనీస వేతనాలు, సంఘ హక్కులను కోల్పోతున్నారన్నారు. నూతన లేబర్ కోడ్స్ ఆధారంగా యాజమాన్యాలు కార్మికులపై పని భారం 8 గంటల నుండి 12 గంటల వరకు పెంచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ హక్కును, సమ్మె హక్కును నిరాకరించి,కనీస వేతనాలు అదనపు పనికి అదనపు వేతనం చెల్లించట్లేదన్నారు. మరోవైపు పెరుగుతున్న ధరలు పెరగని వేతనాలతో కార్మికుల జీవితాలు దుర్భరమవుతున్నాయని, కార్మిక శాఖ అధికారుల తనిఖీలు పర్యవేక్షణ లేకపోవడంతో యాజమాన్యాలు యదేచ్ఛగా శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు కార్మికుల సంఖ్యను తగ్గించి పని భారం పెంచుతున్నారని, కార్మికులు తీవ్రమైన అలసటకు అసమ్మతికి గురవుతున్నారనీ, ఫలితంగా ఇటీవల ఢిల్లీ పరిసర పారిశ్రామిక ప్రాంతాల్లోని వేలాది మంది కార్మికులు




గత్యంతరం లేకనే ఆకస్మిక సమ్మెలకు దిగాల్సి వచ్చిందనీ ఆయన తెలిపారు. ఈ సందర్భంలో పాలకులు కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా అక్రమంగా కేసులు పెట్టి కార్మికులను జైలు పాలు చేశారని, ప్రభుత్వ బాధ్యతారహిత చర్యలను ఏఐటియుసి తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు.ఇటీవల హైదరాబాద్ కెమికల్ ఫ్యాక్టరీ, విశాఖ స్టీల్ ప్లాంట్ లలో సంభవించిన ఘోర ప్రమాదాలు కార్మికుల మరణాలు నాలుగు లేబర్ కోడ్లు దుష్ఫలితము మరియు ప్రైవేటీకరణ విధానం వలనే అని చెప్పకనే చెప్పిందని కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలనీ ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు అమలు చేయము అని కేంద్రానికి తెలియచేయాలనీ,శతాబ్ద కాలంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి గొడ్డుగోర్ల శ్రీను, మండల నాయకులు షేక్ రజాక్ , వివోఏ ల సంఘం నాయకురాలు నాగమణి, ఎలక్ట్రిషన్ సంఘం నాయకులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ఇబ్రహీంపట్నం ఏసీపి, సిఐలకు సన్మానం

- ఏసిపి కెవిపి రాజు, సిఐ మహేందర్ రెడ్డి.
- ప్రముఖ సంఘ సేవకులు బజార్ బిక్షపతి

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఏసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న కెవిపి రాజు సేవలు అమోఘం అంటూ ప్రముఖ సంఘ సేవకులు బజారు బిక్షపతి మాట్లాడుతూ,ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి, వీరిద్దరి సేవలను గుర్తించి, ఎప్పటికప్పుడు క్రైమ్ న్యూస్ ను ఫాలో చేస్తూ, చిటికలో వచ్చిన సమాచారాన్ని చార్ట్ అవుట్ చేస్తూ,అందించినటువంటి సేవల్ని ప్రభుత్వం గుర్తించి ఉత్తమ అవార్డును ప్రభుత్వం అందించినందుకు,నాకు ఎంతగానో సంతోషంగా ఉంది అన్నారు. ఇద్దరు ఆఫీసర్లు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాలని ఇబ్రహీంపట్నంలో కనబడచిన సేవలు మీకు భవిష్యత్తులో రాష్ట్రంలో ఉన్నత స్థాయికి తీసుకపోతాయని ఆయన మనస్ఫూర్తిగా హర్షం వ్యక్తం చేశారు.ఇబ్రహీంపట్నం ఆఫీసర్లుగా ఉత్తములకు,ఉత్తమ చిరు సన్మానం,విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించి పోలీస్ శాఖకు ప్రజలకు విశిష్ట సేవలు అందించినందుకు ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా పథకాలు అందుకున్న ఇబ్రహీంపట్నం ఏసిపి,కెవిపి రాజు ఎస్ హెచ్ ఓ మహేందర్ రెడ్డికి మరిన్ని సేవలు చాకచక్యంగా నిర్వహిస్తారని ఉన్నత స్థాయిలో ఉంటారని ఆశిస్తున్నాను అన్నారు.ఎలిమినేడు గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ






సేవకుడు బజారు భిక్షపతి వార్డు సభ్యులు గట్టు విజయేందర్ గురువారం ఏసీపీ కార్యాలయంలో సన్మానించారు.

## ఎర్రబెల్లి స్వర్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు

**వరంగల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్షం అశోక్ ఆధ్వర్యంలో వారితోపాటు పెరుమాండ్ల రామకృష్ణ,దబ్బుట రమేష్, నత్తి కొర్నెల్ ఎస్సీ సెల్ విభాగం హనుమకొండ జిల్లా అధ్యక్షులు అరూరి సాంబయ్య,చేపూరి చిరంజీవి తదితరులు శుక్రవారం ఆమెను హనుమకొండలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రబెల్లి స్వర్ణ మహిళా సమస్యల పరిష్కారానికి, మహిళల హక్కుల సాధనకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజా సేవలో ఆమె మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో కూడా ప్రజలకు మరింత సేవలందిస్తూ మంచి గుర్తింపు పొందాలని కోరుకున్నారు.ఎర్రబెల్లి స్వర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని ఎర్రబెల్లి స్వర్ణ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన డిసిసి ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి



**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** కొండూరు గ్రామ సర్పంచ్ కుమారుడి వివాహ వేడుకలు స్థానిక భీంగల్ సహస్ర ఫంక్షన్ హాల్ లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి డిసిసి (DCC) ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కలకాలం సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ వివాహ వేడుకలో పలువురు ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొని నూతన జంటకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యావనంది సర్పంచ్ నరేందర్, పెద్ద వాల్గోట్ సర్పంచ్ నర్సింగ్, సంతోష్ నాయక్, సురేష్, సర్పల్లి తండా సర్పంచ్ చందర్, చిమన్‌పల్లి సర్పంచ్, ఉప సర్పంచ్ రాజేందర్ రెడ్డి, జగదాంబ సర్పంచ్ రవి నాయక్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆందోళన బాటలో ఉద్యోగులు - న్యాయమైన డిమాండ్స్

- పిఆర్సి డిఏలు ఓపిఎస్ పునరుద్ధరణకు డిమాండ్
- 27న కలెక్టర్ ఎదుట ధర్న
- సెప్టెంబర్ 1 న హైదరాబాదులో మహాధర్నా





**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ స్థాయి ఉద్యోగులు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ,పెన్షనర్లు ,కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికై తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలకు ఉద్యోగ సంఘాలు సిద్ధమవుతున్నాయి.పి ఆర్ సి ని వెంటనే అమలు చేయడంతో పాటు పెండింగ్లో ఉన్న ఆరు డిఏ లను విడుదల చేయాలని, కంట్రిబ్యూటరీ పెన్సిల్ స్కీమ్ సిసిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ ఓ పి ఎస్ విధానం పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉద్యోగుల, ఉపాధ్యాయ, పెన్షనర్ రా పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని హెల్త్ కార్డులు పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతున్నాయి.ఉద్యోగులు బదిలీలు, పదోన్నతలు వెంటనే చేపట్టాలని జీవో నెంబర్ 25 ను సవరించి ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.జీవో నెంబర్ 90 అమలు చేయడంలో పాటు ఉద్యోగుల,ఉపాధ్యాయుల పెన్షనర్, కార్మికులకు సంబంధిత ఇతర పెండింగ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాయి.దశలవారీగా వారిగా ఆందోళన కార్యక్రమాలు.సమస్యల పరిష్కారానికి టీజీఈ జెఏసి ప్రకటించిన కార్యాచరణ లో భాగంగా ఈనెల 27న రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 1న పెన్షనర్ విద్రువ దినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ పేరుతో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు. పిఆర్సి అమలు చేయాలి.ఊటు యశ్వంత్ జిల్లా టిజిఈ జేఏసీ చైర్మన్..★ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్న పిఆర్సి అమలు కాకపోవడం ఆరు డిఏలు పెండింగ్లో ఉండటం ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి కారణం అవుతుంది సిసిఎస్ రద్దు ఓ పి ఎస్ పునరుద్ధరణ పై ఇచ్చిన హామీలు అమలులో జాప్యం జరుగుతుందని ఉద్యోగుల పెండింగ్ బిల్లులు ,ఆరోగ్యపతకం సమస్యలు వెంటనే పరిష్కరించి ఆర్థిక ఇబ్బందులు తొలగించాలి .లేకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని తెలిపారుఉద్యోగుల హక్కు లను గుర్తించాలి.డాక్టర్ కే.రామరావు టి జి ఈ జె ఏసి జిల్లా కన్వీనర్.ప్రభుత్వం ఉద్యోగులకు రావలసిన పెండింగ్ డిఏలు ,పిఆర్సి వివిధ బిల్లులు వెంటనే చెల్లించి ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలి. కుటుంబ ఉద్యోగ బాధ్యతలతో రతమతమవుతున్న ఉద్యోగులపై అధికారులు వేధింపులు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వం ఇకనైనా స్పందించకపోతే ఉద్యోగుల ఐక్య శక్తిని ప్రజాస్వామ్యం పద్ధతిలో చూపిస్తాం.

## పెద్దపల్లి జిల్లా డీపీఆర్వోగా బి. తిరుమల బాధ్యతలు స్వీకరణ



**పెద్దపల్లి, ఆగస్టు 21, నేటి శుభోదయ :** పెద్దపల్లి జిల్లా జిల్లా పౌర సంబంధాల అధికారిణి (డీపీఆర్వో)గా బి.తిరుమలను ప్రత్యేక కమిషనర్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి కోయ శ్రీ హర్ష ని మర్యాద పూర్వకంగా కలసి బి. తిరుమల శుక్రవారం పెద్దపల్లి జిల్లా డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులతో సమావేశమై శాఖకు సంబంధించిన కార్యక్రమాలు, మీడియా సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం

**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా, తిరుమలాయపాలెం మండల పరిధిలో ని వివిధ గ్రామాలలో శుక్రవారం మండల రెవెన్యూ సిబ్బంది విస్తృతంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు . ఈ సందర్భంగా జల్లేపల్లి గ్రామంలో జిపిఓ రెంటాల బిక్షం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ అన్నపర్తి రవి, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిపిఓ రెంటాల బిక్షం మాట్లాడుతూ మన మండలానికి 21, 882 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు కాగా అందులో నుండి జల్లేపల్లి గ్రామానికి 561 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని ప్రతి ఒక్క రేషన్ కార్డు హోల్డర్ కు సకాలంలో అందే విధంగా అన్ని రకాల చర్యలు మండల రెవెన్యూ అధికారి చేపట్టారని,ఈ సందర్భంగా రెంటాల బిక్షం తెలిపారు. పోట్ల కిరణ్ కుమార్, మాట్లాడుతూ ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రంగా స్మార్ట్ రేషన్ కార్డులు , ఇది రేవంత్ సర్కారు ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేద ప్రజలకు న్యాయం చేయుటకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుతుందని ఈ సందర్భంగా కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అన్నపర్తి రవి, మండల కాంగ్రెస్ నాయకులు పోట్ల కిరణ్ కుమార్, గ్రామ పెద్దలు వున్నం వెంకయ్య, చిప్పరపల్లి రమేష్, బొడ్డు వెంకన్న, సుధాకర్, పుల్లూరు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



## జనసేన పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు నియామకం



**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** జనసేన పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధిగా తెలంగాణ మాజీ హెల్త్ డైరెక్టర్, పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ గడల శ్రీనివాసరావు నియమితులయ్యారు.తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి డా. గడల శ్రీనివాసరావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "జనసేన పార్టీ అధికార ప్రతినిధిగా నాకు అప్పగించిన బాధ్యతను ఎంతో వినమ్రతతో, నిబద్ధతతో స్వీకరిస్తున్నాను. పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, ప్రజా సమస్యలపై పార్టీ వైఖరిని స్పష్టంగా, హుందాగా, బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నా శక్తివంచన లేకుండా కృషి చేస్తాను." అని తెలిపారు.ప్రజాసేవే తన రాజకీయ ప్రయాణానికి ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, "బాధ్యత మారవచ్చు. కానీ నా లక్ష్యం ఒక్కటే ప్రజలే ప్రథమం, ప్రజాసేవే పరమావధి" అని స్పష్టం చేశారు.తెలంగాణలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ, పార్టీకి ప్రజలకు మధ్య బలమైన వారధిగా పనిచేస్తానని డా. గడల శ్రీనివాసరావు తెలిపారు.తనపై నమ్మకం ఉంచిన పవన్ కళ్యాణ్ కి, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి కి, పార్టీ నాయకత్వానికి, అలాగే తనకు నిరంతరం అండగా నిలుస్తున్న జనసైనికులు, వీర మహిళలు, పార్టీ శ్రేణులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు

## పట్టు పరిశ్రమలో పురోగతికి కృషి చేయాలి : జాయింట్ డైరెక్టర్ అనసూయ





**వరంగల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** కేంద్ర పట్టు బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మేరా శహర్ – మేరా అభిమాన్ 2.0' కార్యక్రమంలో భాగంగా హనుమకొండలో పట్టు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన సుమారు 100 మంది పట్టు రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా పట్టు పరిశ్రమ జాయింట్ డైరెక్టర్ అనసూయ మాట్లాడుతూ, పట్టు పరిశ్రమ అభివృద్ధికి రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, శాస్త్రీయ పద్ధతులను వినియోగించుకోవాలని సూచించారు. పట్టు పురుగుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధుల నివారణ, మల్బరీ సాగు, యాంత్రీకరణ, ప్రభుత్వ పథకాలు, రాయితీలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.పట్టు పరిశ్రమకు హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మంచి గుర్తింపు ఉందని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని అనసూయ తెలిపారు. ఆధునిక పద్ధతులను పాటించి నాణ్యమైన పట్టు ఉత్పత్తి చేయడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు.పట్టు పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు అధికారులు, రైతులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు.

## రాగం సుజాత యాదవ్ దశదినఖర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఏ ఆర్ పి టీమ్..



**మియాపూర్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** శేరిలింగంపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సతీమణి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సోషల్ ఎంవెల్ఫేర్ బోర్డు మాజీ చైర్ పర్సన్, సంఘ సేవకురాలు రాగం సుజాత యాదవ్ దశదినఖర్మ కార్యక్రమంను శుక్రవారం రోజు నల్లగండ్ల లోని వారి నివాసంలో మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అట్టేపల్లి రామప్రభు, రాజశేఖర్ , చంద్రిక ప్రసాద్, ఎ ఆర్ పి టీమ్ సభ్యులు కడారి రాజు, కోటమగారి శ్రీనివాస్, సి శేఖర్ ముదిరాజ్ తదితరులు పాల్గొని సుజాత యాదవ్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ వారి కుటుంబ సభ్యులకి ఈ సందర్భంగా సంతాపం ను తెలియజేశారు.

## తెలంగాణ రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులుగా నియమితులైన తోట మహేందర్ యాదవ్



**కొత్తపేట, ఆగస్టు 21, నేటి శుభోదయ :** కొత్తపేట డివిజన్ బీజేపీ నాయకులు తోట మహేందర్ యాదవ్, నూతనంగా తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులుగా నియమితులైన సందర్భంగా, ఈ నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కాసం వెంకటేశ్వర్లు అన్నగారిని ఆయన నివాసం వద్ద కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ అన్న గారితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ముందుగా శ్రీ కాసం వెంకటేశ్వర్లు తోట మహేందర్ యాదవ్ గారికి శుభాకాంక్షలు తెలియజేసి, నూతన బాధ్యతల్లో మరింత విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.అనంతరం తోట మహేందర్ యాదవ్ శ్రీ కాసం వెంకటేశ్వర్లు గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన బాధ్యతల్లో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు చేసిన ఘనత పువ్వాడ అజయ్ కుమార్ కే దక్కుతుంది

### - మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్



**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ఖమ్మం జర్నలిస్టులకు 23 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, అందుకు సంబంధించి జీవో జారీ చేసిన ఘనత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించి, వారి చిరకాల కోరికను నెరవేర్చేందుకు పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని కృషి చేశారని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పువ్వాడ అజయ్ కుమార్ మంత్రిగా ఉన్న సమయంలో 23 ఎకరాల భూమికి రాష్ట్ర కేబినెట్ నుంచి ఆమోదం తీసుకుని, ఆ స్థలాన్ని హౌసింగ్ సొసైటీకి బదలాయిస్తూ జీవో జారీ చేయించారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల సంక్షేమం విషయంలో విఫలమైందని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పువ్వాడ తీసుకున్న చొరవ చేసిన కృషి ఫలితంగా మంజూరైన ఇళ్ల స్థలాలను జర్నలిస్టులకు కేటాయించే ప్రయత్నం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదని ఆరోపించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేసిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఖమ్మం జిల్లాలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాత్రమేనని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వంలో పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.

## జిఓ నెం.39 వల్ల డిప్లొమా ఏఈఓలకు తీవ్ర నష్టం తక్షణమే రద్దు చేయాలి



**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** వ్యవసాయ శాఖలో ఎన్నో సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో రైతులకు సేవలందిస్తున్న డిప్లొమా వ్యవసాయ విస్తరణ అధికారులు, జిఓ నెం.39 వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని డిప్లొమా ఏఈఓల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. డిప్లొమా అర్హతతో వ్యవసాయ శాఖలో నియమితులై, గ్రామస్థాయి నుంచి రైతులకు ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సాంకేతిక సలహాలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలను అందించడంలో డిప్లొమా ఏఈఓలు కీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. అయితే జిఓ నెం.39లోని నిబంధనల కారణంగా డిప్లొమా ఏఈఓల విద్యా, ఉద్యోగ, భవిష్యత్ పదోన్నతి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని వారు పేర్కొన్నారు. ఇప్పటికే అనేక సంవత్సరాలుగా శాఖలో సేవలందిస్తున్న ఉద్యోగులకు తమ విద్యార్హతలను పెంచుకునే అవకాశాలను పరిమితం చేయడం వల్ల వారి సేవా పురోగతికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్లొమా ఏఈఓలకు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించడం ద్వారా వారి క్షేత్రస్థాయి అనుభవానికి, విద్యార్హతకు మరింత విలువ చేకూరుతుందని తెలిపారు. సేవలో ఉండగానే విద్యను కొనసాగించే విధానాన్ని కొనసాగించడం ద్వారా ఉద్యోగుల నైపుణ్యాలను పెంచడంతో పాటు వ్యవసాయ శాఖకు కూడా మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు. జిఓ నెం.39 కారణంగా డిప్లొమా ఏఈఓలపై ఏర్పడుతున్న నష్టాలను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి, వారికి న్యాయం జరిగేలా తగిన సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా వ్యవసాయ శాఖలో పనిచేస్తూ రైతుల కోసం అంకితభావంతో సేవలందిస్తున్న డిప్లొమా ఏఈఓల సేవలను ప్రభుత్వం గుర్తించాలని, వారి విద్యా అభివృద్ధి, పదోన్నతి, ఉద్యోగ భవిష్యత్తుకు అడ్డంకులు కలిగించే నిబంధనలను పునఃపరిశీలించాలని కోరారు. "జిఓ నెం.39 వల్ల డిప్లొమా ఏఈఓలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. సేవలో ఉండగానే విద్యా అవకాశాలను కొనసాగిస్తూ, డిప్లొమా ఏఈఓలకు న్యాయం చేయాలి" అని డిప్లొమా ఏఈఓల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. డిప్లొమా ఏఈఓల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఖమ్మం యుపిహెచ్ కాలనీలో రేషన్ షాపుల అక్రమ దందా

- పట్టించుకోని అధికారులు
- కానరాని తూనికలు కొలతల శాఖ







**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల ఖానాపురం హవేలీ పరిధిలో ఉన్నటువంటి రేషన్ షాపు డీలర్ నెంబర్ ( 2236091) నగిశెట్టి వెంకటేశ్వర్లు తనకు నచ్చిన విధంగా ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ తన వద్దకు రేషన్ కొరకు వచ్చిన ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. కొంతమంది ఆడ పిల్లలు సాయంత్రం ఐదు గంటల సమయంలో రేషన్ షాప్ వద్దకు వెళ్లి రేషన్ కావాలని క్యూలో నిల్చున్నారు. సుమారు 9 గంటల సమయంలో వారి వేలి ముద్రలు వేయించుకొని మీకు డబ్బులు కావాలా, రేషన్ బియ్యం కావాలా అని వారిని ప్రశ్నించాడు. వారు మేము పేదవాళ్ళం మాకు బియ్యం మాత్రమే కావాలి, డబ్బులు మాకు అవసరం లేదు అని చెప్పగా వారిని కావాలని రాత్రి పది గంటల 20 నిమిషములు వరకు వారిని రేషన్ షాపు వద్ద అలానే నిల్చోపెట్టి వారి కుటుంబ సభ్యులు వచ్చి గొడవ చేసిన క్రమంలో వారికి రేషన్ ఇచ్చి పంపించాడు. ఇదేమిటి ఆడపిల్లలను ఈ టైం వరకు రేషన్ షాప్ వద్ద ఉంచటం ఏమిటని ప్రశ్నించిన కుటుంబ సభ్యులపై వాగ్వాదానికి దిగుతూ బెదిరింపులకు గురి చేస్తున్నాడు. ఈ రేషన్ డీలర్ కు కొంతమంది రాజకీయ నాయకుల అండదండలు, మీడియా లోని కొందరు నెల నెల మాముళ్ళు తీసుకొనే వారు ఉండటం వలన వారి అండదండలు చూసుకొని ప్రజల నోటి కాడికి అందవలసిన రేషన్ బియ్యాన్ని డబ్బు రూపంలో సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ రేషన్ డీలర్ తనకు నచ్చిన టైంలోనే వచ్చి రేషన్ ఇస్తాడు. స్థానిక ప్రజలు అతన్ని ఎంత వ్యతిరేకించిన అధికారులు అతనినే కొనసాగిస్తుండటం గమనార్హం. గతంలో పలుమార్లు అతనిపై ఫిర్యాదు అందటం ఈ ఫిర్యాదును అధికారులు పక్కన ఉంచి కంటిన్యూ చేయడం లాంటివి జరుగుతున్నాయి. అక్కడికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై కూడా దుర్భాషలాడుతూ బెదిరింపు చర్యలకు పాల్పడటం గమనార్హం. గతంలో ఈ రేషన్ డీలర్ పై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అధికారులు ఇప్పటివరకు పట్టించుకోకపోగా పూర్తిస్థాయిలో అతనికి మద్దతు తెలుపుతూ ఉన్నారు. ప్రతినెల ఈ రేషన్ డీలర్ వలన అక్కడ ఉన్నటువంటి ప్రజలు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారు . బహిరంగంగానే రేషన్ దుకాణంలో అతను మద్యం సేవిస్తూ ఉంటాడని పలు రకాలుగా స్థానిక ప్రజలు తెలియచేస్తున్నారు. మధ్య మత్తులో అక్కడికి వచ్చినటువంటి ప్రజలను నోటి దురుసుతనంతో రకరకాలుగా వాదనలు చేస్తూ తనకు నచ్చిన వారికి ఒక రకంగా, నచ్చని వారికి ఒక విధంగా రేషన్ కోటాను అందిస్తూ ఉంటాడని స్థానిక ప్రజలు తెలియజేస్తున్నారు .పేద ప్రజలకు ఇస్తున్నటువంటి రేషన్ బియ్యం కొలతలలో కూడా 500 గ్రాముల కాటారాయిని ఉంచితే అది మూడు కేజీలుగా చూపిస్తూ ఉండటం ఆశ్చర్యం. ఒక రేషన్ కార్డు పై సుమారుగా రెండున్నర కేజీల రేషన్ బియ్యం తన ఖాతాలో జమ చేసుకుంటూ వేల రూపాయలను అక్రమంగా తన ఖాతాలో జమ చేసుకుంటున్నా, అటువంటి రేషన్ డీలర్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తెలియజేస్తున్నారు. రేషన్ షాప్ పై చర్యలు తీసుకొని తక్షణమే అతని రేషన్ షాపును తొలగించి అతని స్థానంలో నిరుద్యోగులకు అవకాశం కల్పించవలసిందిగా స్థానిక ప్రజలు కలెక్టర్ ని కోరారు

## మురికి కూపంగా తనికెళ్ళ



**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం తనికెళ్ళ గ్రామం సమీపంలో మురుగుకూపంగా మారిన డ్రైనేజీ, పట్టించుకోని పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి నడి బొడ్డున ఉన్న డ్రైనేజ్ కాలువ పైకప్పు (స్లాబ్) విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. స్లాబ్ ఊడిపోవడంతో అది తెరిచిన మ్యాన్ హోల్‌లా మారి, నిత్యం రాకపోకలు సాగించే ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ముప్పుగా పరిణమించింది.

**- రోత పుట్టిస్తున్న దుర్వాసన**

డ్రైనేజీ తెరిచి ఉండటంతో గ్రామంలో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. ఆ దారిన నడవాలంటేనే ప్రజలు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుర్వాసన వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**- వ్యాధుల భయం**

మురుగు నీరు బహిరంగంగా నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయాయి. డెంగ్యూ, మలేరియా వంటి తీవ్రమైన వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**- కాచుకుని ఉన్న ప్రమాదాలు**

ఊరి నడిబొడ్డులోనే ఈ మ్యాన్ హోల్ తరహా గుంత ఉండటంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, బాటసారులు అందులో పడిపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చిన్న పిల్లలు, వయోవృద్ధుల ప్రాణాలకు ఇది ముప్పుగా మారింది.

**- పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం**



ఈ తీవ్రమైన సమస్యపై పంచాయతీ అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయకుండా పంచాయతీ యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ఆరోగ్యాన్ని, ప్రాణాలను పణంగా పెడుతున్న ఈ డ్రైనేజ్ సమస్యపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విరిగిపోయిన స్లాబ్‌ను పునర్నిర్మించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# వారం రోజుల్లో భూ సర్వే పూర్తి చేయాలి.. జిల్లా కలెక్టర్ అంకిత్..



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, భూ సర్వే పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రపురం, కారుకొండ రెవెన్యూ గ్రామాల పరిధిలో జరుగుతున్న భూ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా భూముల వివరాలు, సర్వే పురోగతి, డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రెండు గ్రామాల పరిధిలో సుమారు 191.25 ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉండగా, 7.50 కిలోమీటర్ల మేర కెనాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 6 ఎకరాల భూ సర్వే పూర్తయినట్లు వివరించారు.సర్వే పనుల్లో జాప్యం లేకుండా ప్రతిరోజూ ఉదయం 8 గంటలకే పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా అవసరమైన సిబ్బందిని సమన్వయం చేసుకోవాలని సూచించారు. వారం రోజుల్లోగా మొత్తం భూ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని ప్రతిరోజూ సమీక్షించి లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భూసేకరణ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. రైతులకు సర్వేకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్, భూ సర్వేకు సహకరించాలని కోరారు. అధికారులు నిర్వహించే సర్వేకు అవసరమైన సమాచారం అందిస్తూ భూసేకరణ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా సహకరించాలని సూచించారు.సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీటి వసతుల విస్తరణకు భూసేకరణ, భూ సర్వే కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, సర్వే, ఇరిగేషన్ శాఖల అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# చట్టవ్యతిరేక వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకోవాలి



**వికారాబాద్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: మండలంలో నిషేధిత వస్తువుల విక్రయాలు, పేకాట వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.నిషేధిత వస్తువుల విక్రయాలు కొందరు వ్యాపారుల ద్వారా తెరచాటుగా కొనసాగుతున్నాయని, వాటిని సేవించిన కొందరు యువకులు రాత్రివేళల్లో వాహనాలపై తిరుగుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని స్థానికులు తెలిపారు. ఉమ్మడి కుల్కచర్ల మండల పరిధిలో పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు కూడా కొనసాగుతున్నట్లు సమాచారం ఉందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల కారణంగా యువత పెడదోవ పట్టే ప్రమాదం ఉందని, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిషేధిత వస్తువుల విక్రయాలు, పేకాటతో పాటు ఇతర అక్రమ వ్యాపారాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను స్థానికులు విజ్ఞప్తి చేశారు.

# వార్షిక తనిఖీలలో భాగంగా హద్నూర్ పిఎస్, జహీరాబాద్ డిఎస్పీ కార్యాలయాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.






**సంగారెడ్డి, ఆగస్టు 21, నేటి శుభోదయ :** వార్షిక తనిఖీలలో భాగంగా ఈ రోజు (21.08.2026) జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ హద్నూర్ పిఎస్, జహీరాబాద్ డిఎస్పీ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హద్నూర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, డీఎస్పీ సైదా నాయక్‌తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనపరచుకున్న లేదా కేసులకు సంబంధించిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు సంబంధిత ఆస్తులను కోర్టులో సబ్మిట్ చేసే వరకు జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని, మిస్సింగ్ కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఆస్తి సంబంధిత నేరాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను (క్రైమ్ ప్రోన్ ఏరియాలు) బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, పగలు–రాత్రి బీట్ విధులలో నిఘా పెంచాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్–2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్–కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ–సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి పట్టు సాధించి, నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ రికార్డులైన పార్ట్–1 నుండి పార్ట్–5 వరకు ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్–2.0లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ..., స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరిస్తామనే భరోసా కల్పించాలని సూచించారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కలిగి శాంతిభద్రతలకు సంబంధించి ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల వివరాలు తెలిసి ఉండాలని, పగలు, రాత్రి బీట్ విధులలో తనిఖీ చేస్తూ, ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్‌డేట్ చేయాలన్నారు. పాపిలాన్ డివైస్ ను వినియోగిస్తూ, అనుమానిత వ్యక్తులను తనిఖీ చేస్తూ, వేలిముద్రలను ద్వారా పాత నేరస్తులను గుర్తించాలని సూచించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, సిబ్బంది ప్రతి ఒక్కరూ అన్ని రకాల విధులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. సిబ్బంది సంక్షేమం కోసం ఎస్ హెచ్ ఓ అవలంబిస్తున్న పనితీరు అభినందనీయం అన్నారు.అనంతరం జహీరాబాద్ డిఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పోక్సో కేసులు, అత్యాచార కేసులు, డౌరీ డెత్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసులో చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని అన్నారు. అదేవిధంగా ప్రతి నెల తప్పనిసరిగా కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిర్వహిస్తూ, అనుమానిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలను గుర్తించి క చర్యలు తీసుకోవాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాలలో రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ఇంజెనీరింగ్ లో లోపాలు ఉంటే ఎన్.హెచ్.ఎ తో మాట్లాడి మరమత్తుల దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. నేరాల ఛేదనలో, నియంత్రణలో కీలకంగా ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. జహీరాబాద్ ప్రాంతం ఇతర రాష్ట్రాలతో సరిహద్దును కలిగి ఉండటం వలన అక్రమ రవాణ జరగానికి అవకాశం ఎక్కువ అని, రాష్ట్ర సరిహద్దులలో నిఘా కట్టుదిట్టం చేయాలని, నాకబంధి నిర్వహిస్తూ, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని అధికారులకు సూచించడం జరిగింది. డిఎస్పీ కార్యాలయ, పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డ్ లను ప్రకటించారు. ఈ వార్షిక తనిఖీల సందర్భంగా జిల్లా ఎస్పీ వెంబడి జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, జహీరాబాద్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతు, టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి, సబ్ డివిజన్ ఎస్ఐలు ఉన్నారు.

# బహుళజాతి సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగాలు సాధించిన 10 మంది యస్.బి.ఐ.టి. విద్యార్థులు

**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** స్వర్ణ భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అటానమస్) విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ సంస్థ షూర్ ఇంటర్నేషనల్ యల్.యల్.సి. సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ అసోసియేట్ ఉద్యోగాలను సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. అమెరికా కేంద్రంగా నిర్వహించబడుతూ మలేషియా, ఒమన్, ఖతార్, భారత్ వంటి వివిధ దేశాలలో విస్తృతంగా వ్యాపిస్తున్న బహుళజాతి సంస్థలో తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంతో తమ కళాశాల ఖ్యాతి గడించిందని అభిప్రాయపడ్డారు. కళాశాలలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్, కోడింగ్ శిక్షణలను సద్వినియోగం చేసుకున్న 10 మంది సి.యస్.ఈ., సి.యస్.యమ్., సి.యస్.డి. విద్యార్థులు సంస్థ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి తెలిపారు. వివిధ దశలలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలలో 173 మంది పాల్గొనగా, ఆన్‌లైన్ అసెస్మెంట్, టెక్నికల్ రౌండ్, హెచ్.ఆర్‌లలో చివరకు 10 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులలో పసుమర్తి సాయి అవినాష్ 12 లక్షల వార్షిక ఆధాయాన్ని అందుకోనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజ్‌కుమార్ తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన వారిలో ఒకరికి 12 లక్షలు, ముగ్గురుకి 10 లక్షలు, ఆరుగురికి 6 లక్షల ప్యాకేజితో వార్షిక ఆధాయాన్ని అందుకోనున్నట్లు కళాశాల వైస్–ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ఎంపికైన వారికి వారి



ఆదాయాన్ని అనుసరించి 24 వేలు, 15 వేలు, 10 వేలు చొప్పున 3 నెలల ఇంటర్న్‌షిప్ స్టైఫండ్ అందుకోనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు సాఫ్ట్‌వేర్ డెవలపర్ అసోసియేట్ హోదాలో తమ వృత్తి జీవితాన్ని ప్రారంభించనున్నారు. విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం,ఉద్యోగ సిద్ధత కల్పించడంలో కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డిపార్ట్‌మెంట్ చేస్తున్న కృషికి ఇది ఒక మంచి నిదర్శనమని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో షూర్ ఇంటర్నేషనల్ యల్.యల్.సి ప్రతినిధులు చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ వివేక్, సీనియర్ హెచ్.ఆర్. పూజలతో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, టి.పి.ఒ. డాక్టర్ యన్. సవిత, డాక్టర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి శుభోదయ
శనివారం | హైదరాబాద్
22 - 08 - 2026
www.netisubhodaya.com



# సర్–2026లో ప్రతి అర్హత గల ఓటరు పేరు తుది జాబితాలో కొనసాగించడమే లక్ష్యం

## : ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- అనామలీస్, నో మ్యాపింగ్ కేసులకు వెంటనే నోటీసులు జారీ చేయాలి-
- ఓటర్లకు 11 రకాల ధృవపత్రాలపై అవగాహన కల్పించి అవసరమైన ఆధారాలు సేకరించాలి
- సర్ పై క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహనతో అధికారులు, సిబ్బంది పనిచేయాలి





**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** సర్–2026 ప్రక్రియలో ప్రతి అర్హత గల ఓటరు పేరును తుది జాబితాలో కొనసాగించడమే లక్ష్యంగా అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.సర్–2026పై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో జిల్లా కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టిగా కృషి చేయడం వల్ల ఖమ్మం జిల్లాలో అనామలీస్, నో మ్యాపింగ్ కేసులు చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. ఇతర జిల్లాల్లో ఒక్కో నియోజకవర్గంలో సగటున 50 వేల వరకు అనామలీస్, నో మ్యాపింగ్ ఓట్లు నమోదైనప్పటికీ, ఖమ్మం జిల్లా ప్రస్తుతం కొంత సౌకర్యవంతమైన స్థితిలో ఉందని తెలిపారు.ప్రస్తుతం రెండు ప్రధాన అంశాలపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. మొదటిది అనామలీస్, నో మ్యాపింగ్ కేసులకు నోటీసులు జారీ చేయడం, రెండవది వచ్చే రెండు నెలల్లో క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించి, పరిష్కరించడం అని తెలిపారు.సర్ ప్రక్రియపై ప్రతి అధికారి, సిబ్బందికి క్షేత్ర స్థాయిలో పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి గుర్తించిన వివిధ రకాల అనామలీస్‌పై ప్రత్యేక అబ్స్ట్రాక్ట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పేర్లలో వ్యత్యాసాలు, తండ్రి–కొడుకుల వయస్సు మధ్య 15 సంవత్సరాల కంటే తక్కువ వ్యత్యాసం, తాత–మనవడి వయస్సు మధ్య 40 సంవత్సరాల కంటే తక్కువ వ్యత్యాసం, ఒకే ఓటరుకు ఆరు కంటే ఎక్కువ ఓట్లు మ్యాప్ కావడం, తదితర కారణాలతో అనామలీస్ ఏర్పడ్డాయని తెలిపారు.పేరు మార్పు, పేర్లలో వ్యత్యాసాలకు సంబంధించిన అనామలీస్ పరిష్కారంపై ఓటర్ల నుంచి పేరు మార్పుకు గల కారణాన్ని వివరిస్తూ డిక్లరేషన్ తీసుకోవాలని సూచించారు. సంబంధిత ఆధారాలను పరిశీలించి కేసులను పరిష్కరించాలని తెలిపారు.ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయం స్పష్టంగా పేర్కొనాలని కలెక్టర్ ఆదేశించారు. నోటీసు అందజేసిన ప్రతి విషయాన్ని బీఎల్ఓ యాప్‌లో ఫొటోతో సహా నమోదు చేయాలని తెలిపారు. నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం ఏడు రోజుల వ్యవధి ఉండాలని అన్నారు. విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.పేరు వ్యత్యాసాల కేసులకు ముందుగానే విచారణ తేదీలను నిర్ణయించి, నోటీసులు జారీ చేసే సమయంలోనే వాటిని పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 27 నుంచి విచారణలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.మిగిలిన అనామలీస్, నో మ్యాపింగ్ కేసులకు నోటీసులు జారీ చేసే సమయంలో ఓటర్ల వద్ద 11 రకాల ధృవపత్రాల్లో ఏవైనా ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంబంధిత ధృవ పత్రాలు లేని అర్హులైన ఓటర్లకు కుల ధృవ పత్రం జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కుల ధృవపత్రం కోసం ప్రత్యేక దరఖాస్తు నమూనా రూపొందించామని, ధృవపత్రాలు లేని ఓటర్లతో ఆ దరఖాస్తును పూర్తి చేయించి, కుల ధృవపత్రం జారీకి అవసరమైన అన్ని పత్రాలను సేకరించాలని సూచించారు. ఓటర్లకు 11 రకాల ధృవ పత్రాలపై పూర్తి అవగాహన కల్పించాలని, అవసరమైన ఆధారాలను సమర్పించేలా వారిని చైతన్యపరచాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి అర్హత గల ఓటరు ఓటును పునరుద్ధరించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. పేరు మార్పు సంబంధిత అనామలీస్‌కు శనివారం నుంచే నోటీసుల తయారీ ప్రారంభించాలని, సోమవారం నుంచి ఇతర ఓటర్లకు కూడా నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.సర్ ప్రక్రియలో సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, బీఎల్ఏలను భాగస్వాములను చేసి నోటీసులు, విచారణ ప్రక్రియపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి అర్హమైన ఓటరు పేరును తుది జాబితాలో ఉండేలా వారి సహకారం తీసుకోవాలని అన్నారు. విచారణ తేదీని ఒకసారి మాత్రమే వాయిదా వేసే అవకాశం ఉంటుందని, ఓటరు విచారణకు హాజరై అవసరమైన ఆధారాలు సమర్పించకపోతే తుది ఓటర్ల జాబితా నుంచి ఆ ఓటు తొలగిపోయే అవకాశం ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. విచారణల నిర్వహణకు అవసరమైన అధికారులను నియమించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపి ఎన్నికల సంఘం అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సెక్టార్ అధికారులను గుర్తించి విచారణ ప్రక్రియలో వారి సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఓటరు పేరు తుదిజాబితాలో ఉండేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డీసీ సదానందం, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ అన్సారీ, ఏఈఆర్ఓలు, మునిసిపల్ కమిషనర్లు, బిఎల్ఓ సూపర్వైజర్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్ కోర్టు అభివృద్ధికి మౌలిక వసతులు కల్పించాలని బార్ అసోసియేషన్ వినతి.



**హయత్ నగర్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** హయత్‌నగర్ కోర్టు పరిధిలోని న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, కోర్టు ప్రాంగణంలో మౌలిక వసతులు మెరుగుపరచాలని కోరుతూ హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్.బి.నగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారిని కోరడం జరిగింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి హయత్ నగర్ కోర్ట్ ప్రాంగణానికి విచ్చేసి లాయర్లతో కలిసి పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. హయత్‌నగర్ కోర్టులో సుమారు 200 మంది న్యాయవాదులు కోర్టుకు వచ్చే కక్షిదారులు,ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కోర్టు ప్రాంగణంలో పార్కింగ్,రహదారులు,డ్రైనేజీ,తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు.అలాగే కోర్టుకు వచ్చే ప్రజలు,న్యాయవాదులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.బార్ అసోసియేషన్ ప్రతినిధుల వినతిని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సంబంధిత సమస్యలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,భాస్కర్ సాగర్,బోడ బిక్షపతి మరియు హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె లింగంగౌడ్ తదితర లాయర్లు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో తెలంగాణ రక్షణ సేనకు నూతన కమిటీలు



**షాద్ నగర్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** షాద్‌నగర్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఇంచార్జ్ సీమల రమేష్ కురుమ ఆధ్వర్యంలో నియోజకవర్గ, పట్టణ, మండల స్థాయి బాధ్యతలను నాయకులకు అప్పగించారు. షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడిగా రంగన్న గౌడ్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా ఎన్. ప్రవీణ, యువజన అధ్యక్షుడిగా శ్రీకాంత్ రెడ్డి ఎంపికయ్యారు. ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడిగా లంకాల శ్రీనివాస్ రెడ్డి, చౌదరిగూడ మండల అధ్యక్షుడిగా కురుమ ఆంజనేయులు, కొందుర్గు మండల యువజన అధ్యక్షుడిగా హర్షవర్ధన్ నియమితులయ్యారు. పార్టీ ప్రధాన సలహాదారుగా డి.వి.టి. వెంకటయ్యను నియమించారు.ఈ సందర్భంగా సీమల రమేష్ కురుమ మాట్లాడుతూ.. కల్వకుంట్ల కవితమ్మ ఆశయమైన సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన ముందుకు సాగుతోందని తెలిపారు. అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ, సామాజిక న్యాయాన్ని పాటిస్తూ కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరలక్ష్మీ వ్రత పూజలో పాల్గొన్న బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి



**కొత్తపేట, ఆగస్టు 21, నేటి శుభోదయ :** శ్రావణ శుక్రవారం సందర్భంగా బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీమతి నందికొండ గీతారెడ్డి గారి ఆధ్వర్యంలో వారి నివాసంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమంలో బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.అనంతరం పూజా కార్యక్రమానికి హాజరైన ఆడబిడ్డలకు వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించడం మన సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

# పిల్లల చేతిలో స్మార్ట్‌ఫోన్ – పెంపకంలో తల్లిదండ్రుల నిర్లక్ష్యం పిల్లల భవిష్యత్తుకే ప్రమాదం!



**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** మొన్న జరిగిన ఉపాధ్యాయురాలి హత్య కాండ యావత్ తల్లి తండ్రులు తల వంపులు తెచ్చింది అని నిజామాబాద్ జిల్లా (టి జి పి ఎ) తెలంగాణ గురుకులల తల్లి తండ్రుల కమిటి అధ్యక్షులు నక్క రాజేందర్ మాట్లాడుతు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఉమ్మడి బాధ్యతతోనే పిల్లల్లో సరైన మార్పు వస్తుంది ప్రస్తుత డిజిటల్ యుగంలో చిన్నతనంలోనే పిల్లల చేతికి స్మార్ట్‌ఫోన్లు రావడం వారి మానసిక వికాసంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఫోన్లలో అందుబాటులో ఉండే హింసాత్మక వీడియోలు, నేరాలకు సంబంధించిన కంటెంట్ పిల్లల లేత మనస్సులపై ప్రతికూల ముద్ర వేసి, వారిని క్రమంగా క్రిమినల్ మైండ్‌సెట్ వైపు నెట్టే ప్రమాదం ఉంది.తల్లిదండ్రులు గమనించాల్సినవి పిల్లలకు అనవసరంగా ఫోన్లు ఇవ్వకూడదు. ఒకవేళ చదువు లేదా ఇతర అవసరాల కోసం ఇచ్చినప్పటికీ, వారు ఎలాంటి వీడియోలు చూస్తున్నారో తల్లిదండ్రులు నిరంతరం గమనిస్తూ ఉండాలి. పిల్లలు తప్పు చేసినప్పుడు ఇంట్లో తల్లిదండ్రులు మందలించకపోవడం, స్కూల్లో ఉపాధ్యాయులు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నప్పుడు ఉపాధ్యాయులపై పగ పెంచుకునేలా చేస్తుంది. ఇది భవిష్యత్తులో తీవ్రమైన నేరాలకు దారితీస్తుంది బడిలో టీచర్లు పిల్లలను మందలించినప్పుడు లేదా ఫిర్యాదు చేసినప్పుడు, పిల్లల ముందే టీచర్లను తప్పుపట్టడం సరికాదు. "ఉపాధ్యాయులు మీ మంచి కోసమే చెబుతున్నారు" అని పిల్లలకు నచ్చజెప్పి సరైన మార్గంలో పెట్టాలి. పిల్లలకు తెలియకుండా టీచర్లను పర్సనల్‌గా కలిసి మాట్లాడాలి. పాఠశాలలో పిల్లల ప్రవర్తన, మానసిక స్థితి ఎలా ఉందో తెలుసుకుని, ఇద్దరూ కలిసి సరైన దిశానిర్దేశం చేయాలి.పిల్లలు అడ్డదారి పట్టి తమ జీవితాలను నాశనం చేసుకోకుండా ఉండాలంటే, ప్రారంభంలోనే వారి ప్రవర్తనను గమనించి సరిదిద్దడం తల్లిదండ్రులుగా మన ప్రథమ బాధ్యత. పిల్లల పెంపకంలో అప్రమత్తంగా ఉంటూ వారికి మంచి భవిష్యత్తును అందిద్దాం.ఉన్న గురువులను కాపాడు కుందాం అని తెలిపారు

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## బోయిన్‌పల్లిలో ఫారం పాండ్ పనులకు శ్రీకారం - ఎంపీడీవో



**మిడ్జిల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో వీబీ–జీ రామ్–జీ పథకం కింద చేపట్టిన ఫారం పాండ్ నిర్మాణ పనులకు ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఫారం పాండ్ నిర్మాణ పనులను ప్రారంభించి, వాటి ప్రాధాన్యాన్ని వివరించారు.వర్షాకాలంలో వృథాగా వెళ్లే నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు రైతులకు సాగునీటి వసతి కల్పించాలనే లక్ష్యంతో ఫారం పాండ్‌ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఫారం పాండ్‌లలో వర్షపు నీటిని నిల్వ చేసుకుని వ్యవసాయ అవసరాలకు వినియోగించుకోవచ్చన్నారు.వర్షపు నీటి సంరక్షణతో భూగర్భ జలమట్టాలు పెరగడంతో బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు ఉపయోగకరంగా ఉండేలా నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు ఇటువంటి నిర్మాణాలు ఎంతో దోహదపడతాయని అధికారులు తెలిపారు. రైతులు ఫారం పాండ్‌లను సద్వినియోగం చేసుకుని సాగు అవసరాలకు నీటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల ఆధ్వర్యంలో రాఖీ హోల్‌సేల్ దుకాణం ప్రారంభం



**నిజామాబాద్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** గ్రామీణ స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజ,రాఖీ హోల్‌సేల్ దుకాణాన్ని నందిపేట్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు,నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం ప్రారంభించి మాట్లాడుతూ....మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ స్వయం సాధికారత సాధించడం నిజమైన స్త్రీ శక్తికి నిదర్శనం అని అన్నారు.మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.మహిళా సంఘాల సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,వారి వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.మహిళా సంఘాల మహిళామణులు వ్యాపార రంగంలో ఇంకా ముందడుగులు వేయాలని అన్నారు.

## ఎత్తైన ధర్మ ధ్వజాన్ని ప్రతిష్ఠించడం చారిత్రాత్మకం

**- ఖిల్లా రామాలయ ఆవరణలో భూమి పూజ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్**



**నిజామాబాద్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** చారిత్రాత్మకమైన ఖిల్లా రామాలయంలో ఎత్తయిన ధర్మ ధ్వజాన్ని ప్రతిష్ఠించడం చారిత్రాత్మకమని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు.నగరంలోని హిందూ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....రాష్ట్ర కూట రాజులు నిర్మించి,చత్రపతి శివాజీ మహారాజ్ గురువు సమర్థ రామదాసు అభివృద్ధి చేసిన ఖిల్లా రామాలయంలో 101 అడుగుల ధర్మ ధ్వజాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు.ధర్మ కార్యానికి హిందువులంతా ఏకమవ్వాలన్నారు.నగరవాసులందరికీ కనపడేలా ఎత్తైన ధ్వజాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గురుప్రసాద్,కార్యదర్శి మారయ్య గౌడ్,మాజీ చైర్మన్ ముక్కా దేవేందర్ గుప్తా,కోశాధికారి వాసు,గంట లింగం,హిందూ సంస్థల ప్రతినిధులు నరేష్,ప్రవీణ్,సూరి,సంతోష్, సాయిరాం, సాయి, సందీప్,బీజేపీ కార్పొరేటర్లు,వీహెచ్ పీ,భజరంగ్ దళ్,ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

# కీర్తించుకోవడానికే మంత్రులను తీసుకువచ్చిన దుద్దిళ్ల శ్రీధర్...

- మూడోసారి మంత్రి అయి మంథనికి అపకీర్తి తీసుకువస్తుండు
- ఇంకా అబద్ధాలపైనే జీవిస్తున్న మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల
- పదిశాతం రోడ్డు పూర్తి చేయకుండా అభివృద్ధి అనడం సిగ్గు చేటు
- ప్రజల రక్తంతో వేల కోట్లు సంపాదిస్తున్న దుద్దిళ్ల కుటుంబం
- మూడేళ్లలో కూల్చివేతలు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదు
- రెండేళ్లుగా అభివృద్ధి పనులు ఎందుకు చేయలేదో జవాబు చెప్పాలే
- ప్రెస్‌మీట్‌లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




**మంథని, ఆగస్టు 21, నేటి శుభోదయ :** మంథని ప్రాంత ప్రజల ముందు తనను కీర్తించుకోవాలనే ఉద్దేశ్యంతోనే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ నలుగురు మంత్రులను తీసుకువచ్చి కోట్ల రూపాయాలను వృదా చేశాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. శుక్రవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న క్రమంలో ఎనిమిదిసార్లు ఒకే కుటుంబానికి ఓట్లు వేసి గెలిపించారని, ఒకే వ్యక్తికి ఐదుసార్లు అవకాశం కల్పిస్తూ మూడోసారి మంత్రి అయి అబద్దాలు,మోసాలు, ప్రజలకు అన్యాయం, మంథనికి అపకీర్తి తీసుకురావడమే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్ సాదించిన ఘనకీర్తి అని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు దగ్గరికి వస్తున్నా దుద్దిళ్ల శ్రీధర్ ఇంకా అబద్ధాలపైనే జీవిస్తున్నాడని, ఇది ప్రజాస్వామ్యానికే అవమానమన్నారు. మంథని నియోజకవర్గ ప్రజల కోసం ఒక్కశాతం ఆలోచన చేయకుండా కేవలం తనను కీర్తించుకోవడానికే నలుగురు మంత్రులను తీసుకువచ్చి అభివృద్ధి పనుల పేరిట శిలా ఫలకాలు వేశారని ఆయన విమర్శించారు. సమాజాన్ని అమాయకులను చేసి ఆలోచన లేకుండా చేసి భారత రాజ్యాంగం, అంబేద్కర్‌ను కనబడకుండా చేసి 40ఏండ్లు దుద్దిళ్ల కుటుంబం అనుభవిస్తుందన్నారు. ఆనాడు మంథనికి న్యాక్ సెంటర్‌కు ఫౌండేషన్ వేస్తున్నం, జీఓ తీసుకువచ్చినం అని చెప్పితే 20ఏండ్ల క్రితమే జీవన్‌రెడ్డి తీసుకువచ్చాడని, నీవు ఆలస్యంగా తీసుకువచ్చావు అవమానపడు అని చెప్పామన్నారు. తక్షణమే క్లాసులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశామని ఆయన గుర్తు చేశారు. అయితే క్లాసులు ప్రారంభించే ప్రక్రియను చేపట్టకుండా ఇప్పుడు న్యాక్ సెంటర్‌కు శిలాఫలకం వేయడం ఏంటని ప్రశ్నించారు. అంతే కాకుండా అభివృద్ధి పనులకు డీఎంఎఫ్‌టీ నిధులను చూపిస్తున్నాడని, మంథని ఎమ్మెల్యే స్వగ్రామమైన దన్నాడ పక్కనే ఉన్న దేవరాంపల్లి వద్ద రోడ్డు పూర్తి కాక దుమ్ము దూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అనారోగ్యానికి గురవుతున్నామని, రోడ్డు బాగు చేయాలని ప్రజలు కోరినా పట్టించుకోకుండా మళ్లీ డీఎంఎఫ్‌టీ నిధులతో మంథనిలో అభివృద్ధి పనులు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తాము పెద్దపల్లి కాటారం వరకు రోడ్డు నిర్మాణం కోసం డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరీ చేశామని, 90శాతం రోడ్డు పనులు పూర్తి కాగా కేవలం 10శాతం మిగిలిపోతే కనీసం ఆ మిగిలిన రోడ్డు పనులు పూర్తి చేయించలేని సన్నాసి మంథని ఎమ్మెల్యే అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రికి ఏం చెప్పాలన్నా దుద్దిళ్ల శ్రీధర్ ద్వారానే చెప్తామని, ముఖ్యమంత్రికి దుద్దిళ్ల శ్రీధర్ అనుసంధాన కర్త అంటూ తుమ్మల నాగేశ్వర్‌రావు గొప్పగా చెప్తున్నాడని, అంతలా కీర్తంచబడే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉండగా అలాంటి ఆలోచనలు చేయకుండా హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కూల్చివేతలు మొదలు పెడితే ఇక్కడ దుద్దిళ్ల శ్రీధర్ మొదలు పెట్టాడని అసహానం వ్యక్తం చేశారు. 2024లో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రితో కలిసి అనేక అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేశారని, ఆర్‌అండ్‌బీ గెస్టహౌజ్, గంగాపురి పోతారం 5కోట్లతో సబ్‌స్టేషన్, గోదావరి నది వద్ద బ్రిడ్జి, నస్తూరిపల్లిలో వంద కోట్లతో సభ పెట్టి ఆరెంద కాడ బ్రిడ్జ అన్నరు ఇలా అనేక పనులు చెప్పి ఇప్పటికే అందులో ఏ ఒక్కటి మొదలు కాలేదని, పనులు ఎందుకు మొదలు పెట్టలేదో దుద్దిళ్ల శ్రీధర్ జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సంపాదించే వారిలో ముఖ్యమంత్రి తర్వాత మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ అని అందరూ చెప్తున్నారని మా ప్రజల రక్తాన్ని తాగి మీ కుటుంబం ఇంకా ఎన్ని కోట్లు సంపాదిస్తవో జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సమాజానికి మహనీయుల చరిత్ర కనబడనీయకుండా చేసి మా నాయనను మమ్మల్ని కీర్తించాలని, ప్రజలకు ఓట్ల విలువ తెలియనీయకుండా ఎన్ని సంవత్సరాలు ఏలుతరని ఆయన ప్రశ్నించారు., దేవుడు ప్రకృతి ఉంటే శిక్ష తప్పదని, ఇంత మోసం, అబద్దాలు ఆడుతున్న దుద్దిళ్ల కుటుంబానికే మొదటి శిక్ష వేయాలని వేడుకుంటునని అన్నారు. యువత ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని,బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు యువతలో చైతన్యం తీసుకురావాలని, 420హమీలతో యావత్ రాష్ట్రాన్ని మోసం చేసిన దుద్దిళ్ల శ్రీధర్ మనం చైతన్యం కాకపోతే ఇంకా ఇలాగే మోసం చేస్తూనే పోతాడని ఆయన అన్నారు.

# నేడు నిజామాబాద్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన

**- ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**

**నిజామాబాద్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం నిజామాబాద్ లో పర్యటించనున్నారు.ఉదయం 7.00 గంటలకు నాగారంలోని నిర్మితి కేంద్రం వద్ద హౌసింగ్ టవర్స్ నిర్మాణం కోసం స్థల పరిశీలన జరపనున్నారు.అనంతరం 43వ డివిజన్ పాములబస్తిలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి,లబ్ధిదారులతో భేటీ కానున్నారు.ఉదయం 10.00 గంటలకు రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు పత్రాలను పంపిణీ చేయనున్నారు.అక్కడి నుండి గూపన్ పల్లికి చేరుకొని తహసిల్దార్ కార్యాలయాలు,సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.అదేవిధంగా దుబ్బ ప్రాంతంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 11.45 గంటల ప్రాంతంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)కు చేరుకుని హౌసింగ్, రెవెన్యూ అంశాలపై నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క,ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి,షబ్బీర్ అలీ,పోచారం శ్రీనివాస్ రెడ్డి,ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు,ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.ఈ నేపథ్యంలో మంత్రి పర్యటనను పురస్కరించుకుని కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.ఏర్పాట్లు పక్కాగా ఉండాలని,ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరస్పర సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అంతకుముందు మంత్రి పర్యటించనున్న ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి,అధికారులకు సూచనలు చేశారు.కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు,ట్రైనీ కలెక్టర్ సురేష్,డీ.ఆర్.ఓ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,ఆర్డీఓ రాజేంద్రకుమార్,ట్రైనీ ఆర్డీఓ సందీప్ తదితరులు ఉన్నారు.



## ఘనంగా వరలక్ష్మి వ్రతం వేడుకలు



**ఏన్కూర్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల వ్యాప్తంగా వరలక్ష్మి వ్రతం వేడుక ల ను వైభవంగా సాంప్రదాయ రీతిలో మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గృహాల్లో అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాన్ని తయారు చేసి వరలక్ష్మీ తల్లిని అత్యంత సుందరంగా పూలతో, నగలతో అలంకరించివరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం ముత్తైదువులను పిలిచి వాయునాలు పంచిపెట్టారు.

## ప్రణాళికతో చదివితేనే లక్ష్యాలను సాధిస్తారు

### - వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం.యాదగిరి



**నిజామాబాద్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** తెలంగాణ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సర విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన Induction Program కు ముఖ్యఅతిథిగా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం.యాదగిరి హాజరైనారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ....ప్రణాళిక బద్ధంగా కష్టపడి చదివితే విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలు తప్పకుండా చేరుకుంటారని తెలిపారు.విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవాటుగా అలవర్చుకుంటే తద్వారా మంచి ఫలితాలు సాధించి వారికి,వారి కుటుంబానికి,దేశానికి దోహదపడగలరని ఆయన పేర్కొన్నారు.తె.యూ.ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆరతి మాట్లాడుతూ..విద్యార్థులు తమ లక్ష్యాలను మారుతున్న టెక్నాలజీని దృష్టిలో ఉంచుకొని నిర్దేశించుకోవాలని,వాటి సాధనకు శ్రమించాలని హితవుపలికారు.కార్యక్రమంలో B.Tech విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు,ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు,వివిధ విభాగాల అధ్యాపకులు బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కోడలి మృతిపై గ్రామస్తుల ఆగ్రహం

### - వెల్జాల్‌లో ఉద్రిక్తత





**తలకొండపల్లి, ఆగస్టు 21, నేటి శుభోదయ :** కడుపునొప్పి భరించలేక వివాహిత యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన తలకొండపల్లి మండలంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇన్స్పెక్టర్ వి. జానకిరామ్ రెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం వెల్జల్ గ్రామానికి చెందిన కూన మణి కంఠకు, ఊర్కోండ మండలం రామ్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మనీషా(21)తో 18 నెలల క్రితం పెద్దల సమక్షంలో వివాహమైంది. వీరికి 7 నెలల కుమారుడు ఉన్నాడు.కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న మనీషా,బుధవారం నొప్పి భరించలేక ఇంట్లోని వాష్ రూమ్‌లో ఉన్న యాసిడ్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కూతురి మరణంపై ఎలాంటి అనుమానాలు లేవంటూ మృతురాలి తల్లి కల్మీచర్ల కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.అంత్యక్రియల వేళ రచ్చ: వెల్జాల్ గ్రామస్తులు, మనీషా బంధువుల ఆందోళన శుక్రవారం వెల్జాల్‌లో మనీషా అంత్యక్రియలు జరగాల్సి ఉండగా నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి.మనీషాది సాధారణ ఆత్మహత్య కాదని,అత్తగారింటి వేధింపుల వల్లే యాసిడ్ తాగిందని ఆరోపిస్తూ వెల్జాల్,రామ్‌రెడ్డిపల్లి గ్రామస్తులు కూన శేఖర్ ఇంటి ముందు భారీ ఆందోళనకు దిగారు. మనీషా మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు.పరిస్థితి చేదాటిపోతుండటాన్ని గమనించిన ఎస్ఐ శేఖర్ వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.దీంతో పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు గ్రామానికి చేరుకున్నాయి.ఆందోళనకారులను శాంతింపజేసి, పోలీసుల భారీ బందోబస్తు నడుమ మనీషా అంత్యక్రియలను పూర్తి చేశారు.ఈ ఘటనతో వెల్జాల్ గ్రామంలో అదనపు బలగాలను మోహరించారు.

## గోదావరి జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- కృష్ణా బేసిన్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలి
- జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహంపై నిరంతర నిఘా



**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** గోదావరి జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.జిల్లాలోని వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.పల్లిపాడు–ఏన్కూర్ మార్గంలో నిమ్మవాగు ద్వారా వైరా చెరువుకు ప్రవహిస్తున్న నీటిని, ఏన్కూర్ వద్ద సీతారామ కాలువ 18ఎల్ లింక్ (రాజీవ్ సాగర్) ద్వారా నాగార్జున సాగర్ కాలువకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.ఏన్కూరు ఎన్ఎస్పీ 52వ కిలో మీటర్ వద్ద ఉన్న రెగ్యులేటర్‌ను కలెక్టర్ పరిశీలించి, అక్కడ నీటి మట్టం, ప్రవాహం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి లభ్యతకు అనుగుణంగా కాలువల ద్వారా వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించారు.కల్లూరు మండలం పాయపూర్ వద్ద మధిర బ్రాంచ్ కెనాల్ ద్వారా పుణ్యపురం మేజర్ కాలువ ద్వారా చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని కలెక్టర్ పరిశీలించారు. కల్లూరు– బత్తులపల్లి మార్గంలో ఎన్ఎస్పీ 21 వ ప్రధాన కెనాల్ ద్వారా కల్లూరు పెద్ద చెరువుకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.కప్పలబంధం వద్ద ఎన్ఎస్పీపై మధిర బ్రాంచ్ కెనాల్ చీలే 72వ కిలోమీటర్ ప్రాంతాన్ని తనిఖీ చేసి నీటి ప్రవాహ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మధిర బ్రాంచ్ కెనాల్ నుంచి చీలే అవుట్ ద్వారా మేజర్ కాలువకు చేరుతున్న నీటిని వెన్నవల్లి, నేలపాడు, తెలగవరం గ్రామాల వద్ద పరిశీలించారు.మధిర బ్రాంచ్ కెనాల్ 24వ కిలోమీటర్ వద్ద ఆంధ్రప్రదేశ్– తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న రెగ్యులేటర్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. రెగ్యులేటర్ ద్వారా జరుగుతున్న నీటి ప్రవాహం, దిగువ ప్రాంతాలకు అందుతున్న నీటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేంసూరు మండలంలోని లంకాసాగర్ చెరువుతో పాటు వివిధ చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆయా చెరువులకు నీరు చేరుతున్న విధానం, నీటి లభ్యత తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో కృష్ణా బేసిన్ పరిధిలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో గోదావరి నుంచి తరలిస్తున్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించాలని, త్రాగునీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రాధాన్యత క్రమంలో నీటిని వినియోగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.కృష్ణా బేసిన్ పరిధిలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో త్రాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన చోట ముందస్తు ప్రణాళికతో నీటి సరఫరా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.నీటి ప్రవాహాల్లో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్లను నిరంతరం తనిఖీ చేయాలని, నీటి లభ్యతను బట్టి చెరువులను నింపేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఇర్రిగేషన్ సీఈ వాసంతి, ఖమ్మం ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, కల్లూరు ఎస్ఈ శ్రీకాంత్, వైరా ఈఈ బాబురావు, సత్తుపల్లి ఈఈ అర్జున్, డిఈ లు, ఏఇ లు తదితర ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నమోదు వేగవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ దీపక్ తివారి







**వికారాబాద్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** జిల్లాలో విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న ఆధార్ అనుసంధానం, ప్రవేశ వివరాల నమోదు, పునాది స్థాయి అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మండల విద్యాధికారులను ఆదేశించారు.జిల్లాలో విద్యార్థుల నమోదును పెంచడంతో పాటు ప్రతి విద్యార్థికి సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేసి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వికారాబాద్ జిల్లాను విద్యార్థుల నమోదులో రాష్ట్రంలో ముందువరుసలో నిలిపేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్ని మండలాల మండల విద్యాధికారులతో విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యార్థుల నమోదు, ఆధార్ నమోదు, అనుసంధానం, ప్రవేశ వివరాల నమోదు, పునాది స్థాయి అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన పురోగతిని సమీక్షించారు. ప్రతి మండలానికి నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ముఖ్యంగా ప్రాథమిక పూర్వ తరగతులు, మొదటి తరగతిలో విద్యార్థుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఆధార్ అనుసంధానం, ప్రవేశ వివరాల నమోదు ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.విద్యార్థుల్లో చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు పెంపొందేలా పాఠశాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి మండల విద్యాధికారి నెలకు కనీసం 15 పాఠశాలలను తప్పనిసరిగా సందర్శించి, బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పునాది స్థాయి అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన పురోగతి తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు.పాఠశాలల సందర్శన సమయంలో నమోదు చేసిన సూచనలు, సమస్యలు, చేపట్టాల్సిన చర్యలు తదుపరి సందర్శనలో అమలయ్యాయా లేదా అనే అంశాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. గత సందర్శనలో సూచించిన అంశాలపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలను సమీక్షించి, పెండింగ్ సమస్యల పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు.మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించి జిల్లాకు నిర్దేశించిన అన్ని లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి స్పష్టం చేశారు.

## కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప మంకాలమ్మ బోనాల ఉత్సవాలు

**-బీరప్పకు మంకాలమ్మకు ప్రత్యేక పూజలు చేసిన కురుమ సంఘం పెద్దలు**



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో గురువారం రాత్రి బీరప్ప మంకాలమ్మ బోనాల ఉత్స వాల సందర్భంగా పెద్ద కురుమ మార బీరప్ప.సెల్విజి అరిగే కృష్ణయ్య కులపెద్దలు రావుల వెంకటయ్య చిందంనరసింహ ఆర్ల యాదయ్య చెరుకు శ్రీశైలం బీరప్ప దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో బీరప్ప మాంకాలమ్మ బోనాల.ఉత్సవాలు పోతరాజుల నృత్యాలతో శివసత్తుల ఆటలతో డిల్లం బల్లెం డప్పు చప్పులతో ఒగ్గు కళాకారుల బాణాసంచాలు పేల్చి అంగరంగ వైభవంగాబోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈబోనాల ఉత్సవాలో మహిళలు పెద్ద ఎత్తున బోనం నెత్తిన ఎత్తుకొని ఊరేగింపులో పాలొని ఆరుట్ల గ్రామ నడిబొడ్డున ఉన్న బొడ్రాయి వద్దకు చేరు కొని ప్రదక్షణాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

## గురువు గౌరవం కోసం గళమెత్తిన త్రివేణి

**- హత్యను ఖండిస్తూ నిరసన ర్యాలీ**




**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కె. రూపారెడ్డి మేడం హత్యను ఖండిస్తూ, ఆమె మృతికి సంతాపం తెలియజేస్తూ త్రివేణి స్కూల్స్, ఖమ్మం శాఖ ఉపాధ్యాయులు నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. టిఆర్ఎస్ఎంఏ ఖమ్మం ఆధ్వర్యంలో పెవిలియన్ గ్రౌండ్స్ నుంచి జెడ్పీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.నల్ల రిబ్బన్లు ధరించి, ప్లకార్డులు, బ్యానర్లతో పాల్గొన్న ఉపాధ్యాయులు మత్తు పదార్థాల నియంత్రణ, గురువుల రక్షణ, పాఠశాలల్లో సురక్షిత వాతావరణం కల్పించాలనీ నినదించారు.రూపారెడ్డి మేడం మృతికి త్రివేణి స్కూల్ యాజమాన్యం, డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రగాఢ సంతాపం తెలిపారు. పాఠశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల సరఫరాను అరికట్టి, గురువులు, విద్యార్థులకు భద్రమైన విద్యా వాతావరణం కల్పించాలని కోరారు.

## ఎన్వైవి గా ఎంపికైన ప్రవళిక యాదవ్‌కు ఘన సన్మానం



**కేశంపేట, ఆగస్టు 21, నేటి శుభోదయ :** షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూక్‌నగర్, కేశంపేట మండలాల బ్లాక్‌లకు జాతీయ యువ స్వచ్ఛంద సేవకురాలిగా చింతకుంటపల్లి గ్రామానికి చెందిన పోచమోని ప్రవళిక యాదవ్ ఎంపిక య్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆమె నివాసంలో భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు రవీందర్ యాదవ్ ప్రవళిక యాదవ్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామానికి చెందిన యువతి జాతీయ స్థాయిలో యువ స్వచ్ఛంద సేవకురాలిగా ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని రవీందర్ యాదవ్ అన్నారు. యువత సమాజ సేవలో ముందుండాలని, ప్రవళిక యాదవ్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ఇతర యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల యువతలో సేవా భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి అవకాశాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. యువత విద్యతో పాటు సామాజిక సేవ, ప్రజా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రవళిక యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమేష్ యాదవ్, మాజీ ఉప మండల పరిషత్ అధ్యక్షురాలు అనురాధ పర్వత్ రెడ్డి, మాజీ సర్పంచ్ పార్వతమ్మ జంగయ్య యాదవ్, మాజీ సహకార సంఘం డైరెక్టర్ పాపన్న యాదవ్, యువ నాయకులు రాము, నాగేష్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొని ప్రవళిక యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# 52వ రెగ్యులేటర్, సిరిపురం మేజర్ కాలువ, జన్నారం నిమ్మవాగు పరిశీలన.

- **సీతారామ కాలువ ద్వారా సాగర్ కాలువలోకి వస్తున్న గోదావరి జలాలపై అధికారులతో సమీక్ష**
- **గోదావరి జలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర్.**



**ఏన్కూరు, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండలంలోని సీతారామ కాలువ ద్వారా సాగర్ కాలువలోకి చేరుతున్న గోదావరి జలాల పరిస్థితిని జిల్లా కలెక్టర్ దివాకర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 52వ రెగ్యులేటర్, సిరిపురం మేజర్ కాలువ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన కలెక్టర్.. కాలువలోకి వస్తున్న నీటి పరిమాణం, నీటి లభ్యత, ప్రవాహ పరిస్థితులపై నీటిపారుదల శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.సీతారామ కాలువ ద్వారా సాగర్ కాలువలోకి చేరుతున్న గోదావరి జలాలను సాగు, తాగునీటి అవసరాలకు సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని వృథా కాకుండా అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని ఆదేశించారు. కాలువల ద్వారా నీటి సరఫరా జరిగే సమయంలో ఎక్కడా నీటి వృథాకు అవకాశం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.అనంతరం జన్నారం వద్ద నిమ్మవాగును కూడా కలెక్టర్ పరిశీలించారు. నిమ్మవాగులో ఉన్న నీటి ప్రవాహం, ఆయకట్టు ప్రాంతాలకు నీటి సరఫరా, భవిష్యత్ అవసరాలకు అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిపై అధికారులతో చర్చించారు. కాలువలు, రెగ్యులేటర్లు, వాగుల వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.గోదావరి జలాలు సాగర్ కాలువలోకి చేరుతున్న నేపథ్యంలో నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా నీటి లభ్యతను నిరంతరం అంచనా వేస్తూ, అవసరమైన మేరకు నీటిని కేటాయించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.కాలువల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి పరిష్కరించాలని, నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. నీటి పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సీఈ వాసంతి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ బాబురావు, డీఈఈలు ఆనంద్, కిషోర్, ఏఈఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నీట్ (పీజీ) పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**- కలెక్టర్ భవేష్ మిశ్రా**



**నిజామాబాద్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నీట్(పీ.జీ) పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు.ఈ నెల 30న జరుగనున్న నీట్ (పీజీ)-2026 పరీక్షను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.జిలాలో నీట్(పీ.జీ) పరీక్షకు 265 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు.అర్సపల్లిలోని ఏ.వీ ఎంటర్ ప్రైజెస్ లో 175 మంది,మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్ సెంటర్ లో 90 మంది పరీక్షకు హాజరవుతారని కలెక్టర్ వివరించారు.ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.కాగా ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని నీట్(పీ.జీ) పరీక్ష నిర్వహణలోనూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని,నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు,బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, విద్యుత్,తాగునీరు,వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని,అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సమీక్షా సమావేశంలో అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే,ట్రైనీ కలెక్టర్ సురేష్,డీ.ఆర్.ఓ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ,కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇండ్ల స్థలాల పాదయాత్ర షెడ్యూల్

- **నేటి ఉదయం సుబ్లేడులో ప్రారంభం**
- **జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పర్యటన**
- **ఇదీ ఏ రాజకీయ పార్టీకి, ప్రభుత్వాలకు వ్యతిరేకం కాదు**
- **టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్- హెచ్ 2843), ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి చేపట్టే పాదయాత్ర తొలిరోజు షెడ్యూల్ ను ఆ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. నైజాం ప్రభువుకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన జర్నలిస్టు షోయబుల్లాఖాన్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన స్వస్థలం తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని విగ్రహం వద్ద శనివారం ఉదయం 8.30 గంటలకు యాత్ర ప్రారంభ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9.30 నుంచి 10 గంటల వరకు సుబ్లేడులో యాత్ర కొనసాగుతుందన్నారు. 10.30 గంటలకు తిరుమలాయపాలెం చేరుకుంటుందన్నారు. అక్కడి జర్నలిస్టులతో సమావేశమై తహశీల్దారుకు వినతి పత్రం ఇస్తామని తెలిపారు. అక్కడి నుంచి నేరుగా మధ్యాహ్నం 12 గంటలకల్లా కూసుమంచి మండల కేంద్రానికి చేరుకుంటామని తెలిపారు. 2 గంటలకు యాత్ర కూసుమంచి నుంచి బయలుదేరి 3 గంటలకల్లా నేలకొండపల్లి మండల కేంద్రానికి చేరుకుంటుందని అన్నారు. అక్కడ తహశీల్దారుకు వినతి పత్రం ఇచ్చి, సమావేశం అనంతరం పాదయాత్ర ముందుకు సాగుతుందన్నారు. సాయంత్రం 4 గంటలకల్లా యాత్ర ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ వరంగల్ క్రాస్ రోడ్ కు చేరుతుందని, అక్కడ నిర్వహించే సభతో పాలేరు నియోజకవర్గంలో పాదయాత్ర ముగుస్తుందని పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని తెలిపారు. జర్నలిస్టులకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీని గుర్తు చేయటం కోసమే అన్నారు. తదుపరి షెడ్యూల్ ను ఆదివారం ప్రకటిస్తామన్నారు. జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలివచ్చి యాత్రను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ చక్రవర్తి, జిల్లా కమిటీ సభ్యులు జానీపాష, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, అంజయ్య, పాలేరు నియోజకవర్గ నాయకులు యాసా లక్ష్మారెడ్డి, ఎన్డీ కర్ణ, పోలెపొంగు నాగరాజు, భూక్యా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువతను విస్మరిస్తే పతనం తప్పదు

- దిమాగి నక్సల్స్ ప్రకటన అసహనానికి నిదర్శనం
- అధ్యయనం పోరాటం అలవర్చుకోవాలి
- యువజన సమాఖ్య జిల్లా మహాసభలో కూనంనేని.
- పోరాటాల కాణాచి యువజన సమాఖ్య : ధర్మేంద్ర, వల్లీ




**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** పాలకులు యువతను విస్మరిస్తే పతనం తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి ఉద్యోగ రంగాలు పొట్టి పోతున్నాయని తద్వారా దేశంలో నిరుద్యోగం పెరిగిపో తుందని ఉపాధి లేక యువశక్తి నిర్వీర్యం అవుతుందని ఆయన తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐ వైఎఫ్) ఖమ్మం జిల్లా 25వ మహాసభలు శుక్రవారం చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో పగడాల భరత్ ప్రాంగణంలో జరిగింది. మహాసభకు ముందు గ్రామంలో వందలాది మంది యువకులు భారీ ప్రదర్శన నిర్వహించారు మహాసభ ప్రారంభ సూచికగా ఏఐవైఎఫ్ పతాకాన్ని కొండపర్తి గోవిందరావు అమరవీరుల స్థూపాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. మహమ్మద్ గౌస్ పాషా అబ్బూరి మహేష్ దండి శ్రీజ మామిడి కిరణ్ యమునా అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ యువజన సమాఖ్య కార్యకర్తలు సామాజిక కర్తవ్యాన్ని నెరవేర్చే క్రమంలో ముందు వరుసలో నిలబడాలని సూచించారు దేశ జనాభాలో సగం కలిగిన యువత హక్కుల కోసం పోరాడాలని పోరా డకుండా ఏ హక్కులు సాధించబడలేదన్నారు. సమాజాన్ని మార్చగలిగే శక్తి యువతరానికి ఉందని అందుకే చైతన్యవం తులైన ఈ తరాన్ని చూసి మోడీ భయపడుతున్నాడని సాంబశి వరావు తెలిపారు మోడీ విధానాల కారణంగా యువత తీవ్ర అసహనానికి గురైందని అసహనం నుంచి ఆవేశం వచ్చిందని దీంతో మోడీ తలవంచక తప్పలేదని ఆయన తెలిపారు. యువతరం ముఖ్యంగా జెన్ జి వీధుల్లోకి పోరాట మార్గం ఎంచుకోవటంతో మోడీ అహంకారం పై తొలివేటు పడిం దన్నారు అందుకే స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా,'" దిమాగి నక్సల్స్ " అన్న పదాన్ని తెరపైకి తెచ్చి ప్రశ్నించే వారిని దిమాగి నక్సల్స్ గా ముద్ర వేసి నిర్బంధించే ప్రయత్నం చేస్తుందని కూనంనేని తెలిపారు మావోయిస్టులను లేదా కమ్యూనిస్టులను భౌతికంగా హతమార్చిన భావజాలాన్ని మాత్రం అంతమందించడం ఎవరి తరం కాదన్నారు భావ జాలాన్ని తుద ముట్టించేందుకు దిమాగి నక్సల్స్ పేరుతో నిర్బంధాలు హతమార్చడం లాంటి చర్యలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ ఉన్న ఉద్యోగాలను ఊడగోడుతున్నారని మోడీ కేవలం అంబానీ అదా నీ కోసం ప్రధానిగా పనిచేస్తున్నారని కూనంనేని ఆరో పించారు ప్రపంచవ్యాప్తంగా వామపక్ష భావజాలం పెరుగు తుందని పెట్టుబడిదారీ దేశం అమెరికాలో ట్రంప్ కు వ్యతి రేకంగా సోషలిస్టులు వరుస విజయాలు సాధిస్తున్నారని న్యూయార్క్ మేయర్ ను సోషలిస్టు భావజాలం ఉన్న వ్యక్తి గెలుచుకున్నారన్నారు సమాజచోదక శక్తి యువతేనని మారిన మారుతున్న పరిణామాలు నిరంతరం అధ్యయనం చేస్తూ పోరాట తత్వాన్ని అలవర్చుకోవాలి యువత సైతాంతిక నైతిక శారీరక బలాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. పోరాటాల కాణాచి ఏఐవైఎఫ్ వలీ- ధర్మేంద్ర భారతదేశ యువజనోద్యమాలకు దిక్సూచి ఏఐ వైఎఫ్ అని పోరాటాల కాణాచిగా పేరుగాంచిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వలివుల్లా ఖాద్రి, కల్లూరి ధర్మేంద్ర తెలిపారు యువజన సమాఖ్య మహాసభలో వారు మాట్లాడుతూ పాలకులు యువతకు సంబంధించిన ఏ పథ కాలను అమలు చేయడం లేదని ఆరోపించారు యువతకు ఉపాధి ఉద్యోగాల కోసం ఏఐవైఎఫ్ పోరాడుతుందని వారు తెలిపారు ఉద్యోగ ఉపాధి కల్పనకు సంబంధించి పాలకులు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన కోసం పోరాడుతామని వలి ధర్మేంద్ర తెలిపారు ఈ మహాసభల్లో సిపిఐ జాతీయ సమితి సభ్యుల భాగం హేమంతరావు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి , కొండపర్తి గోవిం దరావు నానబాల రామకృష్ణ తదితరులు ప్రసంగించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, షేక్ జానీ మియా ఏపూ రిలతాదేవి బిజె క్లెమెంట్ పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జునరావు కూచిపూడి రవి ఆహ్వాన సంఘం అధ్యక్షులు కొల్లి శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి దూసరి గోపాలరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రామకృష్ణ లక్ష్మణ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనాథ్ రెడ్డి శ్రావణ్, చింతల రమేష్, కొల్లి రవి తదితరులు పాల్గొన్నారు

## ఆగస్టు 24న 'మంథని కిచెన్' ప్రారంభోత్సవం

### - 40,052 మంది విద్యార్థులకు పౌష్టికాహారం






**మంథని, ఆగస్టు 21, నేటి శుభోదయ :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించేందుకు మంథనీ అగ్రికల్చరల్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన అత్యాధునిక 'మంథని కిచెన్' ఈ నెల 24న ప్రారంభం కానుంది. 8 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లోని 40,052 మంది విద్యార్థులకు ఆహారం అందించ నున్నారు. మొత్తం 694 ప్రభుత్వ పాఠశాలలు, 17 జూనియర్ కళాశాలలు ఈ కిచెన్ పరిధిలోకి రానున్నాయి.కిచెన్‌లో గంటకు 5,400 ఇడ్లీలు, 2,000 దోశలు, 3,000 పూరీలు తయారు చేసే ఆటోమేటిక్ యంత్రాలను ఏర్పాటు చేశారు. 15 నిమిషాల్లో 1,000 మందికి సరిపడా అన్నం, రెండు గంటల్లో 5 వేల మందికి సరిపడా సాంబార్, కూరలు సిద్ధం చేసే సామర్థ్యం ఉంది. కూరగాయల వాషింగ్, కటింగ్ యూనిట్లు, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్, RO వాటర్ ప్లాంట్, బాయిలర్, సెంట్రల్ గ్యాస్ బ్యాంక్, ఫుడ్ ల్యాబ్, వ్యర్థ నీటి శుద్ధి ప్లాంట్, బయోగ్యాస్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు.నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సూచనల మేరకు విద్యార్థులకు వారంలో ఆరు రోజుల పాటు ఇడ్లీ, సాంబార్, పూరీ, ఆలూ కుర్మా, దోశ, చట్నీ, ఉప్మా, మిల్లెట్ ఇడ్లీ, బోండా తదితర పౌష్టికాహారాన్ని అందించనున్నారు. ఆగస్టు 24న జరిగే ప్రారంభోత్సవానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. HKMCF అధ్యక్షుడు, ది అక్షయ పాత్ర ఫౌండేషన్ తెలంగాణ–ఆంధ్ర ప్రదేశ్ రీజినల్ ప్రెసిడెంట్ హిస్ గ్రేస్ శ్రీ సత్య గౌర చంద్ర దాస స్వామీజీ పాల్గొననున్నారు. కిచెన్ నిర్మాణానికి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (SCCL) తన CSR నిధుల ద్వారా ఆర్థిక సహకారం అందించింది.

## మద్యం మత్తులో కత్తులతో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులను బైండ్ ఓవర్ చేసిన కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు



**ఖమ్మం, ఆగస్టు 21, నేటి శుభోదయ :** కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ బార్‌లో ఇటీవల మద్యం మత్తులో కత్తులతో బెదిరింపులకు పాల్పడిన ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులపై చట్టప్రకారం కేసులు నమోదు చేయడం జరిగింది.ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి, ప్రజల శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వ హించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చట్టపరమైన చర్యల్లో భాగంగా సంబంధిత ముగ్గురు వ్యక్తులను బైండ్ ఓవర్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా కొత్తగూడెం త్రీ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం మత్తులో ఘర్షణలకు పాల్పడుతూ, కత్తులతో బెదిరింపులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

## కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి : బీఎంఎస్



**గజ్వేల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో నెలకొన్న పలు కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీఎంఎస్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్షు రాలు జి. లక్ష్మీ, కార్యదర్శి సాయి కిషోర్ మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లు ఆత్మాభిమానంతో విధులను పరమావధిగా భావించి పనిచేస్తున్నారని, వారి సమస్యలను అధికారులు పరిష్క రించాల్సిన అవసరం ఉందన్నారు. సీనియారిటీ ప్రకారం డ్రైవర్లు, కండక్టర్లకు శాశ్వత డ్యూటీ చార్ట్ ఏర్పాటు చేయాలని, కేఎంపీఎల్ విషయంలో డ్రైవర్లపై మానసిక ఒత్తిడిని తగ్గిం చాలని కోరారు. గజ్వేల్‌లో నూతనంగా నిర్మించిన బస్టాండ్‌లో ఆన్‌డ్యూటీ సిబ్బంది భోజన విరామ సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు బెంచీలు, కుర్చీలతో కూడిన రెస్ట్‌రూమ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.డిపో సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డిపోలోని వాటర్ ప్యూరిఫైయర్‌ను మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని, నైట్ ఔట్ సర్వీసులు నిర్వహించే సిబ్బందికి జేబీఎస్, ఎంజీబీఎస్‌లలో బెడ్లతో కూడిన రెస్ట్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో కార్మికుల కష్టంతో మెదక్ రీజియన్‌లో మొదటి శ్రేణిలో, రాష్ట్ర స్థాయిలోనూ ఉత్తమ స్థాయిలో నిలుస్తోందని పేర్కొన్నారు. కార్మికుల సేవలను గుర్తించి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిపో మేనేజర్‌ను కోరారు. కార్మికుల పక్షాన బీఎంఎస్ ఎల్లప్పుడూ అండుబాటులో ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పి. బాబు, ఆర్థిక కార్యదర్శి ఎం. శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టీవీ కృష్ణ, సీనియర్ నాయకులు రమేష్, రామచంద్రం, వెంకటేష్, కార్యవర్గ సభ్యులు ఖాజా పాషా, వినయ్, చం

## పేకాట స్థావరంపై పోలీసుల మెరుపుదాడి

### మిడ్జిల్ మండల కేంద్రం సమీపంలో ఆరుగురు పట్టుబాటు



**మిడ్జిల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** మిడ్జిల్ మండల కేంద్రం సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీసు బృందం మెరుపుదాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద నుంచి మూడు బైకులు, ఒక స్కూటీతో పాటు రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు. పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620